


ఘోరంగా చంపేశాడమ్మా..!

- నా బిడ్డను బూడిద చేశాడే..
- ఇప్పుడెవరి కోసం బతకాలి
- గుండెలవిసేలా రోదించిన లహరి తల్లి
- కలకలం రేపిన నందికొట్కూరు ఘటన



రోదిస్తున్న విద్యార్థిని లహరి తల్లి లక్ష్మి

నందికొట్కూరు/కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'అమ్మా.. అమ్మా అంటుంటివే..! అమ్మా నేను బాగా చదివి ఇంజనీరు అవుతా.. నిన్ను బాగా చూసుకుంటా.. మన కష్టాలు తీరిపోతాయని అంటివే ..! నా పిల్లను ఘోరంగా చంపినాడు.. బూడిద చేసినాడు.. ఉన్న ఒక్కగానొక్క బిడ్డ అన్యాయమైపోయినాది సారూ. నేనెవరి కోసం బతకాలి. నాకు భర్త లేడు.. ఆ పిల్ల ఒక్కటే నాకు దిక్కు. ఆ పిల్లను చూసుకుంటూ ఇన్నాళ్లు బతికినాను.. కూలినాలి చేసుకుంటూ చదివించినాను.. నా పిల్లను చంపేసినాడు కదయ్యా..! నా బిడ్డే నా జీవితం అనుకొని ఇన్నాళ్లు బతికినాను.. నా బిడ్డే లేకుంటే నేనెవరి కోసం బతకాలి.. అంటూ ప్రేమోన్మాది చేతుల్లో దారుణ హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని ఇంజమూరి లహరి తల్లి లక్ష్మి గుండెలవిసేలా రోదించింది. బిడ్డ పుట్టిన నెల రోజులకే భర్త శివరామ కృష్ణ మృత్యువాత పడితే.. బిడ్డ లహరిలోనే వాళ్ల నాన్నను చూసుకుంటూ అన్నీతానై ఆ చిన్నారిని పోషించింది. కూతురుని చదివించి ఉన్నతంగా చూడాలని ఎన్నో కలలు కంటే.. ఇంతలోనే ప్రేమోన్మాదం తన కూతురు పొట్టనపెట్టుకుంది. ఈ విషాద ఘటన నంద్యాల జిల్లా నందికొట్కూరులో సోమవారం చోటుచేసుకుంది. అవ్వా తాతల ఇంట్లో ఉంటూ ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతున్న లహరిని పడుకున్న గదిలోనే ప్రేమోన్మాది రాఘవేంద్ర పెట్రోల్ పోసి నిప్పంటించడంతో ఆ యువతి సజీవ దహనమైంది. ఆ మంటల్లోనే చిక్కుకున్న ఆ యువకుడు కూడా తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు.



(లహరి ఫైల్)



తీవ్ర గాయాలపాలైన రాఘవేంద్ర



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

నందికొట్కూరు పట్టణంలో ఇంటర్మీడియట్ చదువుతున్న లహరి మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామానికి చెందిన లక్ష్మి కూతురు లహరి(17) నందికొట్కూరులోని అవ్వాతాతలు పార్వతి, మాదవయ్య వద్ద ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతోంది. లక్ష్మి భర్త కుమార్తె పసిబిడ్డగా ఉన్నప్పుడే మృతి చెందాడు. లహరి పదో తరగతిలో తనకు సీనియర్ అయిన వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన రాఘవేంద్ర(21)తో సన్నిహితంగా ఉండేది. అప్పటి నుంచే ఇద్దరు ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఉండేవారు. రాఘవేంద్ర ఆదివారం నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరులో నివాసం ఉంటున్న తన అక్కాబావల ఇంటికి వచ్చాడు. అదే రోజు రాత్రి లహరి, రాఘవేంద్రలు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. నందికొట్కూరులో నివాసం ఉంటున్న లహరి ఇంటికి రాత్రి 11.30 గంటల ప్రాంతంలో రాఘవేంద్ర వచ్చాడని పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే లహరి మృతి చెందడం కలకలం రేపింది. ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇద్దరు రూంలో ఉండగా షార్ట్‌సర్క్యూట్ జరిగిందా.. లేక ఇద్దరు కలిసి ఆత్మహత్యాయత్నం చేశారా.. లేక లహరిని రాఘవేంద్రే హత్య చేశాడా.. లేదంటే ఇద్దరు గదిలో ఉండగా ఎవరైనా నిప్పు అంటించారా అన్న అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. లహరి బంధువులు, కుటుంబ సభ్యులు మాత్రం రాఘవేంద్ర పెట్రోల్ పోసి నిప్పు అంటించాడని ఆరోపిస్తున్నారు.

వివరాలు మెయిన్‌లో..

హాస్టళ్ల అభివృద్ధి పనులకు రూ.789.99 లక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 2024-2025 సంవత్సరానికి కర్నూలు జిల్లాలోని 24 బాలుర, బాలికల వసతి గృహాల అభివృద్ధికి రూ.789.99 లక్షలు విడుదల చేసినట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా సోమవారం తెలిపారు. సొంత భవనాల్లో నడుస్తున్న వసతి గృహాల్లో మేజర్, మైనర్, తాగునీటి సరఫరా, విద్యుద్దీకరణ, తలుపులు, కిటికీలు, ప్రహరీలు, మరుగుదొడ్ల వంటి పనులకు రూ.789.99 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇచ్చి పనులు నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. ఈ పనులను ఈనెల ఆఖరు నాటికి పూర్తి చేసేలా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏజెన్సీలను కలెక్టర్ ఆదేశించారు.

ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) 2020ను మార్చి 31, 2025 వరకు పొడిగిస్తూ రాష్ట్ర మున్సిపల్ శాఖ కార్యదర్శి కన్న బాబు ఉత్తర్వులు జారీ చేశారు. నగర పాలక పరిధిలో అప్రూవల్ కాని లేఅవుట్స్, ప్లాట్లను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐపీఎల్‌పీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సిద్ధం చేయాలన్నారు. ప్రత్యేకంగా రిపోర్టులు తయారు చేసి ప్రధాన కార్యాలయానికి పంపాలన్నారు.

ఎండు మిర్చి ధర పతనం

- క్వింటం గరిష్ఠ ధర రూ.14,999, కనిష్ఠం రూ.2,279
- ఆందోళనలో రైతులు



యార్డుకు రైతులు అమ్మకానికి తెచ్చిన ఎండు మిర్చి

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎండు మిరపకాయల ధర పడిపోయింది. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డుకు ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ తదితర జిల్లాల నుంచి రైతులు 129 క్వింటాళ్ల ఎండు మిర్చి తెచ్చారు. మిర్చి ధర పూర్తిగా పడిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గరిష్ఠ ధర కేవలం రూ.14,999, మధ్యస్థ ధర రూ.8,999, కనిష్ఠ ధర రూ.2,279 పలకడంతో పెట్టుబడి ఖర్చులు కూడా చేతికి రావని రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులు ఎకరా మిరప పంట సాగుకు దాదాపు రూ.లక్షన్నర దాకా ఖర్చు చేశారు. ఇటీవల తుఫాన్‌కు మిర్చి పంటకు తెగుళ్లు, కీటకాలు వ్యాపించడంతో వాటి నివారణకు రైతులు పెద్ద ఎత్తున ఖర్చు చేశారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్ అయి.. పెద్ద ఎత్తున ఎండుమిర్చి ధర తగ్గించేస్తున్నారని, అధికారులు వ్యాపారుల అక్రమాలను కట్టడి చేసి తమకు న్యాయమైన ధరను అందించాలని రైతులు కోరుతున్నారు.

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ సమితి సభ్యురాలిగా శ్రావణి



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ సమితి సభ్యురాలిగా ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణి ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు నగర కార్యదర్శి భారతి, రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం శ్రావణి సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శిగా జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు చేస్తున్నదని వారు అన్నారు. ఢిల్లీ నగరంలో జరుగుతున్న జాతీయ మహిళా సమాఖ్య 22వ జాతీయ మహాసభలలో జాతీయ సభ్యురాలిగా ఎన్నిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఆదోని ఎంఈవోపై చర్యలకు ఆదేశం

- జాప్యం లేకుండా ప్రజల సమస్యలను పరిష్కరించాలి
- లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలు 14 రోజులైనా ఓపెన్ చేసి చూడని ఆదోని మండల విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదోని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారాలపై అధికారులతో సమీక్షించారు. ప్రజల సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు ఓపెన్ చేసి చూడాలని అధికారులను సూచించారు. కర్నూలు ఆర్డీవో, సి. బెళగల్, వెల్దుర్తి, మద్దికెర, గూడూరు, ఎమ్మిగనూరు తహసీల్దార్లు 5 రోజులైనా అర్జీలు చూడలేదని, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఏడు రోజులైనా చూడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రీ ఓపెన్ కేసులకు సంబంధించి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పత్తికొండ వద్ద 6 కేసులు రీ ఓపెన్ అయ్యాయని, వాటిని నాణ్యతతో పరిష్కరించాలన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు వచ్చిన 10 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని జాప్యం లేకుండా పరిష్కరించాలని అన్నారు.

టీడీఆర్ బాండ్లపై విజిలెన్స్ పంజా..!

- అక్రమాలు నిజమే?
- మార్కెట్ విలువ పెంచి బాండ్లు జారీ
- అవకతవకలు జరిగినట్లు గుర్తించిన అధికారులు
- ఐదు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆర్‌వీఈఓ ఎస్పీ కె. చౌడేశ్వరి ఆదేశం

కర్నూలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల అక్రమాలు, అవకతవకలు వాస్తవమే. బాండ్లు జారీ చేసిన ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాం. అవసరమైన రికార్డులు సేకరించి విశ్లేషిస్తే ఎన్నో లోపాలు వెలుగు చూశాయి. కల్లూరు, కర్నూలు సబ్ రిజిస్ట్రార్ విలువ కంటే ఎక్కువ విలువకు బాండ్లు జారీ చేశారు. బాండుదారులకు లబ్ధి చేకూర్చే దురుద్దేశంతోనే మార్కెట్ విలువ పెంచారని స్పష్టమవుతోంది. దీనిపై ఐదు రోజుల్లోగా వివరణ ఇవ్వాలి అంటూ ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, ఎస్పీ కె.చౌడేశ్వరి సోమవారం కర్నూలు నగర పాలక సంస్థ సిటీ ప్లానర్ (సీపీ) ప్రదీప్‌కుమార్‌కు లేఖ రాశారు. అదే క్రమంలో పలువురు బాండ్ పొందిన వ్యక్తులు సబ్ రిజిస్ట్రార్ జారీ చేసిన విలువ పత్రాలు అప్‌లోడ్ చేయలేదు. ఆ వివరాలు ఇవ్వాలంటూ కమిషనర్‌కు మరో లేఖ రాశారు. టీడీఆర్ బాండ్ల జారీలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారులు పంజా విసరడంతో కార్పొరేషన్‌లో కలకలం మొదలైంది. వైసీపీ హయాంలో నిబంధనలు తుంగలో కలిపేసి ఇష్టారాజ్యంగా టీడీపీ బాండ్లు జారీ చేసి ప్రజాధనం దుర్వినియోగం చేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది.

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో భూ సేకరణ చేయలేదు. ఎప్పుడు చేస్తారో కూడా తెలియదు. భూ సేకరణకు నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. అయితే మాస్టర్ ప్లాన్‌లో ఆ స్థలాలు, భూములు ఉన్నాయనే ఒకేఒక కారణంతో విచ్చలవిడిగా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లు జారీ చేశారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో రూ.వంద కోట్లకు పైగా విలువ చేసే 135 బాండ్లు జారీ చేయడం వెనుక గత అధికార వైసీపీ ముఖ్యనేతల పాత్ర ఉందని, టీడీఆర్ బాండ్ల జారీ రూపంలో కార్పొరేషన్ ఖజానాకు భారీ నష్టాన్ని కలిగించారు. భూ యజమానులతో సంబంధం లేకుండా, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) కూడా లేకుండా గడువు తీరిన ల్యాండ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ ఆధారంగా టీడీఆర్ బాండ్లు జారీ చేయడం వెనుక భారీ అవినీతి అక్రమాలకు తెర తీశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. టీడీఆర్ బాండ్లు జారీలో జరిగిన అక్రమాలపై సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో వరుస కథనాలతో ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది.



అక్రమాలు నిగ్గు తేల్చిన విజిలెన్స్

కర్నూలు నగరపాలక సంస్థలో జరిగిన టీడీఆర్ బాండ్ల జారీలో జరిగిన అక్రమాలు నిగ్గు తేల్చేందుకు రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, ఎస్పీ కె.చౌడేశ్వరి ఆధ్వర్యంలో విచారణకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జారీ చేసిన బాండ్ల సమగ్ర వివరాలు సేకరించారు. బాండ్లు జారీ చేసిన ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాండ్ జారీ చేసిన విలువ ఎంత..? ఆ సమయంలో సబ్ రిజిస్ట్రార్ విలువ ఎంత ఉంది..? ఇలా అన్ని రికార్డులను విశ్లేషించారు. అక్రమాలు జరిగాయని గుర్తించారు. అందుకు సంబంధించిన వివరణ ఇవ్వాలని విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి లేఖ రాయడంతో కలకలం రేగింది. నిబంధనలు ప్రకారం రోడ్ల విస్తరణలో కోల్పోయే స్థలానికి.. రోడ్డు విస్తరణంలో 100 చదరపు మీటర్లు స్థలం కోల్పోతే 400 చదరపు మీటర్లు, ఎన్విరాన్‌మెంట్ బఫర్ జోన్‌లో 100 చదరపు మీటర్లకు 200 చదరపు మీటర్లకు టీడీఆర్ బాండ్లు జారీ చేస్తారు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో వైసీపీ హయాంలో 135 బాండ్లు జారీ చేశారని, వాటి విలువ రూ.వంద కోట్లకు పైగా ఉంటుందని అంటున్నారు. పలు బాండ్లు జారీలో కొందరు వ్యక్తులకు లబ్ధి చేకూరేలా దురుద్దేశపూర్వకంగా బాండ్లు జారీ చేసినట్లు గుర్తించారు. అంటే వీటి జారీలో అక్రమాలు జరిగాయనే వాస్తవాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. విజిలెన్స్ అధికారులు ఎలాంటి నివేదిక ఇస్తారు..? ఇబ్బందులు తప్పవా..? అంటూ గత ప్రభుత్వంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో పని చేసి బదిలీపై ఇతర మున్సిపాలిటీలకు వెళ్లిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది గుండెల్లో గుబులు మొదలైంది.

మిగతా 6లో..

ప్రగతి పథంలో నడిచేనా..!

కూటమి ప్రభుత్వంలో మొదటి డీఆర్సీ సమావేశం

గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా పడకేసిన అభివృద్ధి

సరైన నిర్ణయాలతో జిల్లాకు మేలు చేయాలని ఆశిస్తున్న ప్రజలు

7

అమ్మఒడి పేరిట బురిడీ

ఖాతాల్లో నగదు కాజేసిన సైబర్ కేటుగాళ్లు

2

జలాధివాసం నుంచి సంగమేశ్వర శిఖరం

కొత్తపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సప్తనదీ జలాల నుంచి సంగమేశ్వర ఆలయ శిఖరం మెల్లమెల్లగా బయల్పడుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం క్రమేణ తగ్గుతూ సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి ప్రాజెక్టు వద్ద పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా 864.30 అడుగులకు చేరుకుంది. అలాగే ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలు కాగా 120.0754 టీఎంసీలుగా నమోదైంది. దీంతో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ కృష్ణానదిలో మరబోటు ద్వారా వెళ్లి ఆలయ శిఖరంపై శివుని ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగు, తాగునీటి అవసరాల కోసం నీటి విడుదల కొనసాగిస్తే సంక్రాంతి తర్వాత పూర్తి స్థాయిలో ఆలయం బయల్పడే అవకాశం ఉందన్నారు. శిఖరం బయల్పడటంతో భక్తులు ఎగువ ఉమామహేశ్వర స్వామి ఆలయం నుంచి భక్తులు ఫొటోలు తీసుకున్నారు. అలాగే సప్తనదుల్లో పుణ్యస్నానాలు ఆచరించి ఎగువ ఉమామహేశ్వరస్వామిని దర్శించకుని పూజలు చేశారు.



కృష్ణానది నీటి నుంచి బయల్పబడిన ఆలయ శిఖరం

పేదల చదువుకు సహకారం

- విద్యార్థులకు వాహనం సౌకర్యం
- కంప్యూటర్లు, స్టడీ మెటీరియల్ అందజేత
- విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న జియో మైసూరు కంపెనీ

తుగ్గలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

బంగారు నిక్షేపాలు వెలికి తీసే జియో మైసూరు కంపెనీ విద్యాభివృద్ధికి కృషి చేస్తోంది. పేద విద్యార్థులకు పలు సౌకర్యాలు కల్పిస్తూ వారికి అండగా నిలుస్తోంది. విద్యార్థులకు వాహనం, డైనింగ్ హాలు, స్టడీ మెటీరియల్, కంప్యూటర్లు సమకూర్చింది. బోధనకు తగినట్టుగా ఉపాధ్యాయులను నియమించింది. ఇలా పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తోంది. అంతేగాకుండా ఆపదలో ఉన్న వారిని రక్షించడం కోసం అంబులెన్సు సౌకర్యం ఏర్పాటు చేసింది. కంపెనీ చుట్టూ ఉన్న పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతోంది.



పగిడిరాయి పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటారియల్ అందిస్తున్న దృశ్యం

1994 నుంచి బంగారు నిక్షేపాల కోసం అన్వేషణ

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా జీఎస్ఐ 1994లోనే మండలంలోని జొన్నగిరి, పగిడిరాయి గ్రామాల మధ్య బంగారు నిక్షేపాలు ఉన్నాయని గుర్తించింది. అప్పట్లోనే విదేశీ పెట్టుబడుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. 2005లో జియో మైసూరు కంపెనీ దరఖాస్తు చేస్తే 2013లో అన్ని రకాల అనుమతులు వచ్చాయి. 2014 నుంచి బంగారు నిక్షేపాల తవ్వకాల కోసం ఏర్పాట్లు చేయడంతోపాటు 1750 ఎకరాల్లో మొదటగా లీజుకు తీసుకొని ఏడాదికి ఎకరాకు రూ.16,500 చెల్లిస్తూ వస్తోంది. అందులోనే 250 ఎకరాల్లో కొనుగోలు చేసి పైలట్ ప్రాజెక్టుతోపాటు ప్రాసెసింగ్ యూనిట్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టారు.



ప్రజా సేవలో కంపెనీ ముందుంటుంది



బంగారు నిక్షేపాలతో పాటు ప్రజా సేవ చేయడం కూడా బాధ్యతగా తీసుకున్నాం. ఇప్పటికే కంపెనీ చుట్టూ ఉన్న పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. ముఖ్యంగా విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుంటాం. ప్రతి ఒక్కరూ సహకరిస్తే కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతాం. - మానస రంజన్ బిశ్వాల్, జియో మైసూరు కంపెనీ డైరెక్టర్

విద్యార్థులకు వాహన సౌకర్యం



విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వాహనం

జియో మైసూరు కంపెనీ స్థాపించినప్పటి నుంచి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులోభాగంగానే విద్యార్థులకు వాహనాలు లేక నడిచివస్తున్నారనే ఉద్దేశంతో మొదటగా ఆటో ఏర్పాటు చేసింది. రెండు నెలల నుంచి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి దాదాపు 70 మంది విద్యార్థులను చెన్నంపల్లి, పగిడిరాయి గ్రామాలకు తరలిస్తోంది. పగిడిరాయి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు కొంప్యూటర్లు అందించింది. కంప్యూటర్, హిందీ ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి విద్యను అందించడంతో పాటు ఏటా 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటిరీయల్స్ అందిస్తోంది. విద్యార్థులు చెట్ల కిందే కూర్చొని భోజనం చేస్తున్నారని తెలుసుకొని జడ్పీహెచ్ఎస్‌లో జియో మైసూరు కంపెనీ వారు డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ ఆ డైనింగ్ హాలులోనే కూర్చుని భోజనం చేస్తున్నారు. అలాగే తాగునీటి వసతి కూడా కల్పించారు.

ఆపదలో ఉన్నవారికి అంబులెన్సు

పగిడిరాయి కొత్తూరు, బొండ్లవాని పల్లె, జొన్నగిరి, ఉప్పర్లపల్లి, ఎర్రగుడి తదితర గ్రామాల పరిధిలో ఎవరికైనా ఆరోగ్యం బాగ లేకపోయినా, ప్రమాదాలు జరిగితే వారిని సురక్షితంగా వైద్యశాలకు తరలించడం కోసం జియో మైసూరు కంపెనీ అంబులెన్సు సౌకర్యం కల్పించింది. దీంతో 108 వాహనం రావడం ఆలస్యమైనా జియో మైసూరు కంపెనీ అంబులెన్సులో రోగులను, క్షతగాత్రులకు ఆసుపత్రులకు తరలిస్తున్నారు.



అంబులెన్సు

పేదలకు ఉచిత వైద్యం, రక్తదానం

ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలకు అన్ని రకాల వైద్య చికిత్సలు చేయిస్తున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతోపాటు జియో మైసూరు కంపెనీ వారు రక్తదానం చేస్తున్నారు. అన్ని వైద్య పరీక్షలు చేయించడంతోపాటు ఉచిత మందులు కూడా సరఫరా చేస్తున్నారు. పగిడిరాయిలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు రోగులు, వైద్య సిబ్బందికి సురక్షిత నీరు అందించేందుకు వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. అలాగే రోగులకు వైద్య చికిత్సలు చేసే సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా ఇన్వర్టర్‌ను కూడా అందించారు.



జియో మైసూరు కంపెనీ ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

జియో మైసూరు కంపెనీ సహకారంతో పాఠశాల అభివృద్ధి



జియో మైసూరు సంస్థ సహకారంతో విద్యార్థులకు అన్ని వసతులు సమకూరుతున్నాయి. అలాగే విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నారు. పాఠశాలకు వారు అందించే సేవలు అభినందనీయం. - సౌజన్య, ఉపాధ్యాయురాలు, జడ్పీహెచ్ఎస్, పగిడిరాయి

ఎనిమిది కి.మీ. నడిచి వెళ్లాలి



జియో మైసూరు కంపెనీ వాహనం కల్పించక ముందు దాదాపు ఎనిమిది కి.మీ. నడిచి వెళ్లాలి. లేదంటే సైకిళ్లపై, ఏదైనా వాహనాలను లిఫ్టు అడిగి స్కూల్‌కు వెళ్లే వాళ్లం. జియో మైసూరు కంపెనీ వాహనం ఏర్పాటు చేసినప్పటికీ నుంచి ప్రార్థన సమయానికి పాఠశాలకు వెళ్తున్నాం. - గీత, విద్యార్థి చెన్నంపల్లి

టీడీఆర్ బాండ్లపై విజిలెన్స్ పంజా..!

(5వ పేజీ తరువాయి)

'విజిలెన్స్' గుర్తించిన లోపాలు

- షేక్ రసూల్ అనే వ్యక్తికి సర్వే నంబరు 340/1లో టీడీఆర్ బాండ్ నంబరు.1016/00079/టీడీఆర్/ఎన్‌టీఆర్ఎన్/2022 కింద 445.92 చదరపు మీటర్లు టీడీఆర్ బాండ్ ఇచ్చారు. ఆ ప్రాంతంలో చదరపు మీటరకు మార్కెట్ విలువ ఎంత ఉందో టీడీఆర్ బాండుదారుడు నమోదు చేయలేదు. సబ్ రిజిస్ట్రార్ రికార్డులు పరిశీలిస్తే.. చదరపు మీటర్లు రూ.600 ఉంది. ఆ బాండ్ అమ్మే సమయంలో బాండుదారుడు సమర్పించిన సర్టిఫికెట్ ప్రకారం రూ.18,000 చూపారు. అయితే 2023 జూన్1న చదరపు అడుగు రూ.8,000, 1/8/2019 నుంచి 9/8/2023 మధ్య రూ.5,800, 10/8/2020 నుంచి 31/5/2923 మధ్య రూ.6,000 ఉన్నట్లు గుర్తించారు. అంటే మార్కెట్ విలువ కంటే రూ.12,000 పెంచి జారీ చేసినట్లు గుర్తించారు.
- గోరంట్లవెంకటరమణాశెట్టి అనే వ్యక్తికి సర్వే నంబరు 421/1లో కల్లూరు వార్డు 51/1-1ఏ-4 వద్ద టీడీఆర్ బాండ్ నం.1016/00015/టీడీఆర్/ఎన్‌టీఆర్ఎన్/2021 కింద 397.12 చదరపు మీటర్లు టీడీఆర్ బాండ్ ఇచ్చారు. గిఫ్ట్‌డీడ్‌లో మార్కెట్ విలువ నమోదు చేయలేదు. ఈ స్థలం కల్లూరులో సర్వే నంబరు.421/1, 77 వార్డు పాత శ్రీనివాస్ థియేటర్ వద్ద ఉంది. సేల్‌డీడ్‌లో కల్లూరు 75 వార్డు చూపారు. ఇది ఎలా సాధ్యం. ఈ బాండు అమ్మిన సమయంలో మార్కెట్ విలువ రూ.20 వేలు చూపారు. సబ్ రిజిస్ట్రార్ రికార్డులు పరిశీలిస్తే.. 2023 జూన్1న చదరపు అడుగు రూ.7వేలు, 1/8/2019 నుంచి 9/8/2023 మధ్య రూ.6,600లు, 10/8/2020 నుంచి 31/5/2923 మధ్య రూ.వేలు ఉన్నట్లు గుర్తించారు. అంటే మార్కెట్ విలువ కంటే రూ.13,000 పెంచడమే కాకుండా ఈ స్థలం 75వ వార్డులో ఉన్నట్లు గుర్తించారు.
- షేక్ రసూల్ అనే వ్యక్తికి వార్డు నంబరు.76 పరిధిలో సర్వే నంబరు.134, 158లో టీడీఆర్ బాండ్ నంబరు.1016/00032/టీడీఆర్/ఎన్‌టీఆర్ఎన్/2021 కింద 1,839.44 చదరపు మీటర్లు టీడీఆర్ బాండ్ ఇచ్చారు. బాండుదారులు మార్కెట్ విలువ సర్టిఫికెట్ సమర్పించలేదు. గిఫ్ట్‌డీడ్‌లో చదరపు అడుగు రూ.18,000 ఉంది. 76వార్డు, రాజశేఖర్ నగర్, బళ్లారి రోడ్డు అని చూపారు. అయితే సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ రికార్డు ప్రకారం ఇందిరా నగరంలో సర్వే నంబరు.134, 158లో చదరపు అడుగు 2,921 జూన్ 9 నాడు రూ.6 వేలు ఉంది. ఈ బాండులో కూడా రూ.12 వేలు మార్కెట్ విలువ పెంచినట్లు గుర్తించారు.
- కర్నూలు కార్పొరేషన్ పరిధిలో పలువురికి టీడీఆర్ బాండ్లు జారీ చేస్తే.. వారిలో మెజార్టీగా బాండ్లు అమ్ముకున్నారు. బాండ్లు అమ్మే సమయంలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ జారీ చేసిన మార్కెట్ విలువ సర్టిఫికెట్లు బాండుదారులు అప్‌లోడ్ చేయలేదని, అలాంటి వారు 30 మందికి పైగా ఉన్నారు. ఆ సమయంలో మార్కెట్ విలువ వివరాలు ఇవ్వాలంటూ విజిలెన్స్ అధికారులు కమిషనర్‌కు లేఖ రాశారు.



కర్నూలు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలపై సెప్టెంబరు 27న ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం



సెప్టెంబరు 28న ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం

బాండ్లు జారీ చేయడం ఒక్కటే మా బాధ్యత

టీడీఆర్ బాండ్లు జారీ చేయడం ఒక్కటే మా బాధ్యత. మాస్టర్ ప్లాన్ రోడ్డులో స్థలాలు కోల్పోయేవారు కార్పొరేషన్‌కు అప్పగిస్తే రోడ్డు విస్తరణలో నాలుగు వంతులు, బఫర్‌జోన్‌లో అయితే ఇచ్చిన స్థలానికి రెండింతల టీడీఆర్ బాండ్లు ఇస్తాం. మార్కెట్ విలువ మాకు సబంధం లేదు. అది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చూసుకుంటుంది. విజిలెన్స్ అధికారులు పంపిన లేఖకు సమాధానం ఇస్తాం. ఇప్పటి వరకు ఎలాంటి లేఖ మాకు రాలేదు. - ప్రదీప్‌కుమార్, సిటీ ప్లానర్, కర్నూలు నగర పాలక సంస్థ

సకల శాస్త్రాల సారాంశమే భగవద్గీత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత సకల శాస్త్రాల సారాంశమని తిరుమల తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లాల కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. సోమవారం నంద్యాల శ్రీకృష్ణమందిరంలో టీడీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ మందిర అధ్యక్షుడు పార్థసారథి క్రిష్ణ, విజయచంద్రుడు నిర్వహణలో భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా 6-9 తరగతులలో సుస్మిత, చతుర్‌శ్రీ, హనీష, 8-9 తరగతుల విభాగంలో సూర్య ధరణి, తరుణ్, షణ్ముఖేశ్వరి అందుకున్నారు. న్యాయనిర్ణేతలుగా పార్వతి, డాక్టర్ దేవి, దయానంద్‌సింగ్, భానోజీరావు, శిరీష, సంగీత, అపర్ణదీపిక, పుష్పలత, సత్యారెడ్డి వ్యవహరించారు.

పల్లకిలో విహరించిన ఆది దంపతులు

పల్లకి సేవను నిర్వహిస్తున్న వేద పండితులు →



మహానంది, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి ఆది దంపతులైన మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి పల్లకిలో విహరించారు. ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పల్లకిలో ఆశీనులు గావించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. భక్తుల శివనామ స్మరణ మధ్య ఆలయ ప్రాంగణంలో పల్లకి సేవ ఉత్సవం మేళతాళాలతో నిర్వహించారు.

శివానికి షాట్‌పుట్‌లో బంగారం

అభినందించిన తెలంగాణ గవర్నర్



గోల్డ్ మెడల్ సాధించిన శివాని

మద్దికెర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శివాని దివ్యాంగురాలు. చిన్నతనంలో కుడిచేయి పోయింది. అయినా ఆమె ఎక్కడా అధైర్యపడలేదు. పైగా ఈ ఏడాది అక్టోబరు 18న తల్లి అకాల మరణం చెందినా ఆత్మ విశ్వాసంతో ఆడి థాయిలాండ్‌లో జరిగిన షాట్‌పుట్‌లో బంగారు పతకం సాధించింది. మద్దికెరకు చెందిన ఉప్పర వీరప్ప, లలిత దంపతుల పెద్ద కూతురు శివాని. తండ్రి కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. శివాని ఎమ్మిగనూరు జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికైంది. క్రీడలపై మక్కువతో హైదరాబాదులోని గోపనపల్లి జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాలలో చదువుతూ ఆదిత్య మెహతా పారా స్పోర్ట్స్ అకాడమీ ద్వారా కోచ్ వేణు వద్ద శిక్షణ పొందుతోంది. డిసెంబరు 1 నుంచి థాయిలాండ్‌లో 7వ తేదీ వరకు జరిగిన ఎఫ్46 అండర్-20 విభాగంలో షాట్‌పుట్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. శివాని బృందాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అవార్డు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శివాని మాట్లాడుతూ ఈ విజయం తన అమ్మకు అంకితం అని పేర్కొంది.

ఆ ఘటన నేటికీ కళ్లముందే...

- బాటసారులకు రక్షణగా వెళ్తుండగా తీవ్రవాదుల దాడి
- మేం తేరుకునేలోగానే తూటాలకు మా ఎస్ఐ మృతి
- ఎదురు కాల్పులకు దిగి నలుగురిని కాల్చి చంపాం
- భారత్‌లోకి అడుగుపెట్టకుండా మిగతా వారిని తరిమికొట్టాం
- మా పోరాట పటిమకు గుర్తుగా పోలీస్‌మెడల్స్ ప్రకటించారు
- పత్తికొండకు చెందిన జవాన్ బొల్లం రామాంజినేయులు

పత్తికొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'డిసెంబరు 1, 2020వ సంవత్సరం భారత్ - పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతమైన జమ్మూ కశ్మీర్‌లోని రాజోలి ప్రాంతం. రాజోలి ప్రాంతం నుంచి వేరే ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు రక్షణగా మా ఎస్ఐతోపాటు మేం ఏడుగురు జవానులం ముందుకు సాగుతున్నాం. ఒక్కసారిగా తుపాకీల శబ్దం. ఏం జరుగుతుందో అర్థం చేసుకునేలోగా ముందు నడుస్తున్న మా ఎస్ఐ తుటాల ధాటికి నేలకొరిగాడు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించేందుకు పాకిస్తాన్ తీవ్రవాదులు కాల్పులకు దిగనట్లు కొద్దిసేపులోనే మేం అర్థం చేసుకున్నాం. అక్రమంగా దేశంలోకి ప్రవేశించాలన్న వారి ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు ఎదురు కాల్పులకు దిగాం. మేం నడుస్తున్న ప్రాంతానికి కొంచెం పై ప్రాంతంలో సుమారు 15 మంది దాకా తీవ్రవాదులు ఉన్నట్లు గుర్తించాం. వారిని దేశంలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ఏడుగురం ఎదురు కాల్పులతో వారిపై విరుచుకుపడ్డాం. నలుగురు తీవ్రవాదులను కాల్చి చంపాం. మా వీరోచిత దాడికి మిగిలిన తీవ్రవాదులు అక్కడి నుంచి పారిపోయారు. మా ఎదురు కాల్పులలో చనిపోయిన తీవ్రవాదలు పాకిస్తాన్‌కు చెందిన హిజబుల్ ముజాయిద్దిన్ గ్రూపు తీవ్రవాదులుగా గుర్తించాం. ఈ పోరులో ప్రాణాలు పోగొట్టుకున్న ఎస్ఐకి భారత ప్రభుత్వం కీర్తి చక్ర బిరుదును అందించి గౌరవించింది. మాకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పోలీస్ పతకాన్ని ప్రకటించారు. సోమసురక్షా భల్ అంటూ జవాన్ పేరును సూచిస్తూ దేశ రక్షణ కోసం మీ వీరత్వానికి గుర్తింపుగా ఈ పోలీస్ పతకాన్ని అందిస్తున్నామని రాష్ట్రపతి సంతకంతో కూడిన ప్రశంసాపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్రపతి నుంచి అందిన ప్రశంసాపత్రంతోపాటు పోలీస్ మెడల్‌ను ఆదివారం రాజస్థాన్‌లో జరిగిన బీఎస్ఎఫ్ 60వ వార్షికోత్సవ సంబరాలలో హోంమంత్రి అమిత్‌షా ఆ ఏడుగురు బీఎస్ఎఫ్ జవాన్లకు అందించారు. దేశరక్షణలో ప్రాణాలకు ఎదురొడ్డి పోలీస్‌మెడల్స్‌ను సాధించిన ఏడుగురు జవాన్లలో నేను ఒకడిని' అంటూ పత్తికొండ పట్టణానికి చెందిన బొల్లం రామాంజినేయులు తెలిపారు. ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రం భూజ్ సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న రామాంజినేయులును పోలీస్‌మెడల్ అందుకున్న సందర్భంగా ఆంధ్రజ్యోతి పలకరించింది దీంతో 2020 డిసెంబరు 1న రాజోలిలో జరిగిన నాటి సంఘటన వివరాలను వెల్లడించారు.



చిన్ననాటి నుంచే సైనికుడు కావాలన్న కల

ఒంట్లో సత్తువ ఉన్నంత వరకు దేశ రక్షణ కోసం పని చేస్తా

2004లో 59వ బెటాలియన్‌లో బీఎస్ఎఫ్‌లో చేరాను. 20 ఏళ్లకు పైగా దేశ రక్షణ కోసం పని చేస్తున్నాను. మాకు 60 ఏళ్ల వరకు విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుంది. 2020 డిసెంబరు 1న జరిగిన సంఘటనలో ప్రాణాలతో బయటపడతామన్న ఆలోచన కూడా మాకు లేదు. తీవ్రవాదులను తరిమికొట్టి దేశ రక్షణకు మా వంతు పని చేయాలన్న ఆలోచనే మమ్మల్ని ముందుకు నడిపించింది. హోంమంత్రి అమిత్‌షా నుంచి మెడల్ అందుకోవడం గర్వంగా ఉంది. ఒంట్లో సత్తువ ఉన్నంత వరకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ద్వారా సైనికుడిగా దేశరక్షణ కోసం పని చేస్తాను. - బొల్లం రామాంజినేయులు



చిన్ననాటి నుంచే సైనికుడు కావాలని కలలు..

పత్తికొండ పట్టణం పాతపేట తేరుబజార్ ప్రాంతంలో నివసించే బొల్లం మాదన్న, గౌరమ్మల ఏకైక సంతానం బొల్లం రామాంజినేయులు. వారిది చేనేత కుటుంబం. పైచదువులకు వెళ్లే స్థోమతలేక ఇంటర్‌తో చదువు ఆపేశాడు. నెరవేర్చుకునేందుకు వివిధ ప్రాంతాలలో జరిగే మిలిటరీ సెలక్షన్‌లకు వెళ్లేవాడు. అందుకు ఖర్చుల కోసం తల్లిని ఇబ్బంది పెట్టకుండా దుకాణాలలో పని చేసేవాడు. చివరకు 2003లో చిత్తూరులో జరిగిన బీఎస్ఎఫ్ సెలెక్షన్స్‌కు ఎంపికయ్యాడు. ముందుగా బెంగళూరు ఆ తర్వాత పంజాబ్‌లో ఏడాది శిక్షణ పూర్తి చేసుకొని 2004లో త్రిపురలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ 59వ బెటాలియన్‌లో విధుల్లో చేరాడు. జమ్మూ ప్రాంతంలోని సాంబ, కుపువాడ, శ్రీనగర్ (పంథ్‌చౌక్) రాజోలి సరిహద్దు ప్రాంతాలలో పని చేశాడు. ప్రస్తుతం గుజరాత్‌లోని భూజ్ సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు.



హోంమంత్రి అమిత్‌షా నుంచి పోలీస్ మెడల్ అందుకుంటున్న రామాంజనేయులు

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నిరుద్యోగులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాలయాపన చేయకుండా వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం బిర్లాగేటు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి డీఎస్సీ నిరుద్యోగులు ధర్నా చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష, జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షకు ఒకే ప్రశ్నాపత్రం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగులను నిర్లక్ష్యం చేసిందని, ఇప్పుడు కూడా ఇలాగే జరిగితే.. ఈ ప్రభుత్వానికీ అదే గతి పడుతుందని హెచ్చరించారు. డిసెంబరు నాటికి డీఎస్సీ పరీక్షను పూర్తి చేసి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన సీఎం ఏదో ఒక కారణం చెప్పి మరో ఆరు నెలలుగా పొడిగించడం సమంజసం కాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా డీఎస్సీ నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి హుశేన్ బాషా, అబ్దుల్లా, సురేష్, సాయి, ఉదయ్, నిరుద్యోగులు ఉమర్, చంద్రశేఖర్ రెడ్డి, రాజేష్ నాయక్, చంద్రార్డన్, డీవైఎఫ్ఐ కార్యకర్తలు నిరుద్యోగులు పాల్గొన్నారు.

గుంతలోపడి రెండు ఎద్దులు మృతి

- మహిళా రైతును కాపాడిన స్థానికులు



మృతిచెందిన ఎద్దులను బయటకు తీస్తున్న గ్రామస్తులు

పాణ్యం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపూరు మజరా గ్రామం అహల్యాపురం సమీపంలో సోమవారం జరిగిన ప్రమాదంలో రెండు ఎద్దులు మృతి చెందాయి. ప్రమాదానికి గురైన మహిళా రైతును సమీప రైతులు కాపాడారు. తహసీల్దారు నరేంద్ర నాథ్‌రెడ్డి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పోలుగారి ప్రసాద్ భార్య రూతమ్మతో కలిసి ఎద్దుల బండిలో మద్దూరు పొలిమేరలోని పొలానికి వెళ్లారు. మిరపకు పురుగుల మందు పిచికారీ చేయడానికి ట్యాంకు నీరు నింపుకొని వస్తుండగా ప్రమాదావశాత్తు పక్కన ఉన్న రైల్వే పనుల కోసం తీసిన గుంతలో ఎద్దుల బండి పడింది. ప్రసాద్ ఈత కొట్టుకుంటూ బయటికి రాగా సమీపంలోని రైతులు రూతమ్మను రక్షించారు. ఎద్దులు నీటిలో మునిగి మృతి చెందాయి. పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎద్దుల విలువ రూ.1.50 లక్షలు ఉన్నట్లు బాధిత రైతు ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

పోలీసులకు అందని సమాచారం

గ్రామంలో ఉదయం జరిగిన సంఘటన గురించి రాత్రి వరకు సమాచారం లేదని పోలీసులు పేర్కొన్నారు. రెండు ఎద్దులు ప్రమాదంలో చనిపోయినా సచివాలయ పోలీసులు గానీ, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి పోలీసులకు తెలియజేయాలన్న నిబంధనలు గాలికొదిలేశారు.

గాజులపల్లిలో ఘర్షణ

- నలుగురిపై కేసు నమోదు

మహానంది, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లిలో రస్తా విషయంలో ఘర్షణ పడిన నలుగురిపై కేసు నమోదైంది. గాజులపల్లికి చెందిన రాజగోపాల్‌తోపాటు ఆయన కొడుకుపై అదే గ్రామానికి చెందిన శేఖర్, శివసాయి, లక్ష్మీదేవి, శిరీషలు రస్తా విషయమై ఘర్షణ పడి కర్రలతో దాడి చేశారు. దీంతో రాజగోపాల్ భార్య లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

భార్యా భర్త ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న పల్లవి, భార్గవ్

బనగానపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్ర సమీపంలోని పార్వతి గుడి సమీపంలో తెలంగాణకు చెందిన దంపతులు సోమవారం ఆత్మహత్యాయత్నం చేశారు. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా ఐజకు చెందిన భార్గవ్, పల్లవి భార్యాభర్తలు. వీరు ఇద్దరు పురుగుల మందు తాగగా అటు వైపు వస్తున్న అయ్యప్ప స్వామి భక్తులు గమనించి 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. 108 సిబ్బంది ఇద్దరిని వాహనంలో బనగానపల్లె ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డాక్టర్లు ఇక్కడ వైద్య చికిత్స చేసి నంద్యాల వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు. మతిస్థిమితం లేని భార్గవ్ ప్రోద్బలంతోనే ఇరువురు పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలుస్తోంది.

నిత్యం అందుబాటులో ఉంటా

- రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్



ప్రమాణ స్వీకారం చేస్తున్న మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముస్లింల అభివృద్ధి కోసం నిత్యం అందుబాటులో ఉంటానని ఏపీ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలాన్ షేక్ ముస్తాక్ అహ్మద్ అన్నారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షరీఫ్, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే నక్క ఆనంద్‌బాబు, తెలుగుదేశం పార్టీ నాయకుల సమక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సందర్భంగా మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ తన కష్టాన్ని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ పదవి ఇచ్చారని ధన్యవాదాలు తెలిపారు.

ప్రగతి పథంలో నడిచేనా..!

- కూటమి ప్రభుత్వంలో మొదటి డీఆర్సీ సమావేశం
- గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా పడకేసిన అభివృద్ధి
- సరైన నిర్ణయాలతో జిల్లాకు మేలు చేయాలని ఆశిస్తున్న ప్రజలు



నంద్యాల కలెక్టర్ కార్యాలయం

నంద్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో మొదటిసారి డీఆర్సీ సమావేశం మంగళవారం జరగబోతోంది. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి రానున్నారు. అభివృద్ధి చెందేందుకు అన్ని అవకాశాలు నంద్యాల జిల్లాకు ఉన్నా, గత వైసీపీ పాలన వల్ల అనుకున్న స్థాయిలో ప్రగతి పథంలో నడవలేదు. ఈ నేపథ్యంలో మంగళ వారం జరగబోయే డీఆర్సీ సమావేశం ప్రత్యేకతను సంతరించుకుంది. కూటమి నేతలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేదీ లేనిదీ స్పష్టం కానుంది.

రైతులకు ఏం హామీలు ఇస్తారో చూడాలి..

ఇటీవలే తుఫాను ధాటికి జిల్లాలో చాలాచోట్ల పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. వారిని ఆదుకునేలా ఈ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. భూసార పరీక్షలు, భూసార కార్డుల పంపిణీ, పరీక్ష ప్రయోగశాలల వంటి వాటికి నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

యాంత్రీకరణకు ఊతం..

గత ప్రభుత్వంలో యాంత్రీకరణ పథకం లబ్ధిని వైసీపీ నేతలే అనుభవించారు. ట్రాక్టరు వంటి ముఖ్యమైన వాటిని వైసీపీ నేతలు ఇళ్లలోనే పెట్టుకుని సొంతానికి వాడుకున్నారు. కూటమి పాలనలో రైతుకు పూర్తి మేలు చేసేలా డీఆర్సీ సమావేశం నిర్ణయం తీసుకుంటుందా? చూడాలి.

సాగు నీటి ప్రాజెక్టులకు..

అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు పెద్దగా నిధులు కేటాయించలేదు. ఈ అభివృద్ధి సమావేశంలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేకంగా చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటే బాగుటుంది.

రోడ్లు బాగుపడతాయా?

నంద్యాల జిల్లాలో దాదాపు 3300 కి.మీ ఆర్అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం మొన్నటి బడ్జెట్‌లో దాదాపు ఆర్అండ్‌బీ శాఖకు రూ.9554 కోట్లు కేటాయించింది. కూటమి ప్రభు త్వంలో రోడ్ల గురించి డీఆర్సీ సమావేశంలో కీలక నిర్ణయం జరగాల్సి ఉన్నది.

పంచాయతీలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారా?

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పటికే గ్రామ సభలను నిర్వహించి గ్రామాల్లో సిమెంటు రోడ్ల పనులు ప్రారంభించారు. ప్రస్తుత బడ్జెట్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధికి దాదాపు 16,739 కోట్లు కేటాయించింది. ఈ క్రమంలో డీఆర్సీ సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలకు ప్రాధాన్యముంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టేల్సి ఉంది. మంగళవారం జరిగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమావేశంలో ఆయా నియోజక వర్గాల ప్రజాప్రతినిధులు నిర్ణయాలు తీసుకుంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు మేలు జరుగుతుంది.

కునారిల్లుతున్న తాగునీటి పథకాలు..

జలజీవన్ మిషన్ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాల్సిన నిధులు కేటాయించలేదు. దీంతో ఈ పథకం ఇంకా నత్తనడకన నడుస్తోంది. దీనిపైన ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించి ప్రజలకు మంచి నీరు అందించేందుకు నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



పయ్యావుల కేశవ్

నేడు ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ రాక..!

- డీఆర్సీ సమావేశంలో పాల్గొననున్న మంత్రి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో మంగళవారం మొదటి డీఆర్సీ సమావేశం జరుగనుంది. రాష్ట్ర ఆర్థిక శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పయ్యావుల కేశవ్ రానున్నారు. సమావేశానికి ముందు జిల్లా టీడీపీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు జిల్లా ప్రజాప్రతినిధులతో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది.

రైతులతోనే విత్తనోత్పత్తి చేయించండి

- బకాయిలు విడుదల చేయిస్తా
- ఏపీ సీడ్స్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి



శనగ విత్తనాలను పరిశీలిస్తున్న చైర్మన్

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాసి రకం విత్తనాలను కొని పంట దిగుబడులు రాక రైతులు నష్టపోతున్నారని, ఇటువంటి పరిస్థితి భవిష్యత్తులో రాకుండా ఏపీ సీడ్స్ సంస్థ ద్వారా రైతులతోనే నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం నగరంలోని ఏపీ సీడ్స్ సంస్థ కార్యాలయాన్ని చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ సీడ్స్ సంస్థ ద్వారా రైతులకు అందిస్తున్న విత్తనాలను ఆయన పరిశీలించారు. ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ ధనలక్ష్మి సంస్థ ద్వారా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో అందిస్తున్న విత్తనాలు, తదితర అంశాలపై చైర్మన్‌కు వివరాలు అందించారు. ఇకపై ఉమ్మడి జిల్లాల రైతులు వ్యాపారులు, దళారులపై ఆధారపడరాదని, ప్రభుత్వం నుంచి పూర్తి సహకారాన్ని అందేలా చూస్తానన్నారు. శనగ రైతులకు అందాల్సిన బకాయిలు రూ.2 కోట్లు వెంటనే విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు కర్నూలు ఏపీ సీడ్స్ నుంచి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందేవని, వివిధ రకాల విత్తనాలను రైతులతోనే ఉత్పత్తి చేయించి తక్కువ ధరకు అందించే వాళ్లని అన్నారు. మళ్లీ ఆ పరిస్థితిని తెచ్చేందుకు సంస్థ అధికారులు పని చేయాలని, ఈ విషయంలో అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సిబ్బంది రెహిమాన్, తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు ఘటన బాధాకరం

- మంత్రి బీసీ



బనగానపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరులో ఇంటర్ విద్యార్థినిపై పెట్రోలు పోసి హత్య చేయడం అత్యంత బాధాకరమని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం విచారం వ్యక్తం చేశారు. ఎస్పీ ధికారజ్ సింగ్ రాణాతో ఫోన్‌లో మంత్రి బీసీ మాట్లాడి ఘటనా విరాలను తెలుసుకున్నారు. ఇది దురదృష్టకరమని, ఇలాటి ఘటనలు పునరావృతం కాకుండా కళాశాలల వద్ద నిఘా పెంచాలని ఎస్పీని కోరారు.

అమ్మఒడి పేరిట బురిడీ

- ఖాతాల్లో నగదు కాజేసిన సైబర్ కేటుగాళ్లు



బాధితుడు నాగరాజు



బాధితుడు ఆనంద్

ఆలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమ్మఒడి పేరుతో సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. ఖాతాలో ఉన్న డబ్బులను పక్కా ప్రణాళికలతో కాజేశారు. అరికెర గ్రామానికి చెందిన నాగరాజు, మల్లికార్జున బతుకుదెరువు కోసం తెలంగాణ వలస వెళ్లారు. నాగరాజుకు ఆదివారం మధ్యాహ్నం ఓ వ్యక్తి కాల్ చేశాడు. అమరావతి నుంచి మాట్లాడుతున్నానని చెప్పాడు. 'అనంతరం మీ వలంటీర్ ఎవరు అని అడిగాడు. మీకు అమ్మ ఒడి వచ్చిందా అని ప్రశ్నించాడు. రాలేదని సమాధానం ఇవ్వడంతో మీ వలంటీర్ ఆనంద్‌ను లైన్‌లోకి తీసుకుంటానని చెప్పి కాన్ఫరెన్స్ కాల్ చేశాడు. ఆనంద్ నేను అమరావతి నుంచి మాట్లాడుతున్నా.. వీళ్లకు అమ్మఒడి ఎందుకు రాలేదని ప్రశ్నించాడు. అనంతరం వీడియో కాల్ చేసి రాజముద్ర గుర్తు చూపించాడు. అనంతరం వారి ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నెంబర్ తెలుసుకొని రూ. 12,500 లాగేశాడు. అలాగే మల్లికార్జున అనే వ్యక్తి నుంచి రూ.9 వేలు, వలంటీర్ ఆనంద్ నుంచి రూ.5 వేలు చాకచక్యంగా కొట్టేశాడు. వాళ్ల ఫోన్ నుంచే ఉదిత్ శర్మ అనే వ్యక్తికి అమౌంట్ ట్రాన్స్‌ఫర్ అయినట్టు ఫోన్‌పేలో చూపించింది. చివరకు మోసపోయామని తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటూ జరిగిన విషయాన్ని గ్రామస్థులకు తెలియజేశారు.

ఈ హాస్టల్ వార్డెన్ మాకొద్దు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమను వేధిస్తున్న హాస్టల్ వార్డెన్ తమకొద్దని పట్టణ శివారు ప్రాంతంలోని ఎస్సీ కళాశాల హాస్టల్ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం హాస్టల్ నుంచి ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ముట్టడించారు. మెనూ పాటించకుండా హాస్టల్ వార్డెన్ తమను ఇబ్బందులు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. వంద మంది విద్యార్థులకు రెండు మూడు కేజీల కూరగాయలు తెచ్చి వాటిని సర్దుతున్నారని వాపోయారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుందని పలుమారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. హాస్టల్ వార్డెన్ కర్నూలులో ఉంటూ ఎప్పుడో ఒకసారి వస్తున్నాడని, శివారు ప్రాంతంలో శిథిలావస్థ భవనంలో బిక్కుబిక్కుమంటూ ఉంటున్నామన్నారు. అధికారులు హాస్టల్‌ను సందర్శించాలని డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో విచారణ చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

చిన్న కోతతో గుండె ఆపరేషన్

- విజయవంతంగా నిర్వహించిన డా. ప్రభాకర్ రెడ్డి



కోలుకుంటున్న బాలుడు



డా.సి.ప్రభాకర్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పాములపాడు మండలం మిట్టకందాల గ్రామానికి చెందిన 13 ఏళ్ల ఖాజా బాషాకు గుండెకు రంధ్రం పడింది. ఈ కేసును నంద్యాల కార్డియాలజీ వైద్యులు కర్నూలు జీజీహెచ్‌కు రెఫర్ చేశారు. ఈ నెల 5వ తేదీ కార్డియోథొరాసిక్ విభాగానికి తల్లిదండ్రులు బాలుడ్ని తీసుకువచ్చారు. సిటీ సర్జరీ హెచ్‌వోడీ డా.సి.ప్రభాకర్ రెడ్డి బాలునికి పరీక్షలు నిర్వహించి ఎదిగే వయస్సు కాబట్టి మినిమిల్లీ ఇన్వాసివ్ హార్ట్ బైపాస్ సర్జరీ (ఎంఐసీఎస్) చేయాలని నిర్ణయించారు. సోమవారం డా.సి. ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో బాలునికి మూడున్నర గంటలు శ్రమించి చిన్న కోతతో గుండె ఆపరేషన్ (ఎంఐసీఎస్)ను విజయవంతంగా నిర్వహించారు. గత వారం రోజుల క్రితం హైదరాబాదు షెరటాన్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఐసీఎస్, రోబోటిక్ ఆపరేషన్‌లో మెలకువలతో ఎంసీఎస్ ఆపరేషన్‌ను డా. ప్రభాకర్ రెడ్డి నిర్వహించారు. బాలునికి గుండెలో హోల్ ఉంది.. అందువల్ల బోన్ కూడా కట్ చేయాల్సి వస్తుంది. కానీ సోమవారం చిన్న కోత ఆపరేషన్ చేసినందు వల్ల ఎముక కట్ చేసే పని ఉండదు. ఇలాంటి ఎంఐసీఎస్ ఆపరేషన్లు కర్నూలు జీజీహెచ్‌లో 60 దాకా చేసినట్లు సీనియర్ సిటీ సర్జన్ డా.సి. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో కార్డియోథొరాసిక్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రవీంద్ర, అనస్థీషియా సీనియర్ ప్రొఫెసర్ డా.కొండారెడ్డి, పెర్ఫ్యూజనిస్టు రమేష్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

అవినీతి రహిత సమాజం కోసం పాటుపడాలి

ఏపీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషా



మాట్లాడుతున్న మహబూబ్ బాషా

కర్నూలు కల్చరల్ డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఏపీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషా అన్నారు. సోమవారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. నగరంలోని టౌన్ మోడల్ జూనియర్ కళాశాల సమావేశ హాలులో ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో మహబూబ్ బాషా మాట్లాడుతూ అవినీతిపై యువత పోరాడాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సి.సుంకన్న, లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, న్యాయవాది పాపా రావు, ప్రజాస్వామ్య పరిరక్షణ సంస్థ జిల్లా కార్యదర్శి, న్యాయవాది రవికుమార్, లైబ్రరీ సైన్స్ అధ్యాపకుడు ఎన్ జలగంగాధర్, వృత్తి విద్యా అధ్యాపకులు లలితాకుమారి, రోహిణి, పరమేష్ ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 'అవినీతి రహిత సమాజంలో యువత పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఉచిత విద్యుత్ యూనిట్లను పెంచాలి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీవనజ్యోతి ఉచిత విద్యుత్ పథకానికి అర్హులైన దళిత గిరిజనుల ఇళ్లకు 200 యూనిట్లు నుంచి 400 యూనిట్ల వరకు పెంచాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు భైరాపురం రాజు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ దళిత గిరిజనులు గృహ వినియోగానికి వాడిన పాత బకాయిలను రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సుధాకర్, సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు రూ.8 కోట్లు మంజూరు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.8కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ తెలి పారు. ఏపీఈడబ్ల్యూడీసీ ద్వారా పనులు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. అదేవిధంగా బీసీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతుల కోసం నిధుల మంజూరు చేయాలని కోరుతూ సంబంధిత శాఖ ఉన్నతాధి కారికి డీవో లేఖను తయారు చేసి తీసుకురావాలని బీసీ వెల్ఫేర్ అధికారిని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల పనుల్లో భాగంగా నగరంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పాతనగరంలోని ఓల్డ్‌టౌన్ సెక్షన్ ఏఈ మదన్ మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓల్డ్‌టౌన్ సెక్షన్ పరిధిలోని జోహరాపురం, చిత్తారివీధి, జమ్మిచెట్టు, రాంబోట్ల ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సెలవులో రూరల్ తహసీల్దార్

కర్నూలు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ మండల తహసీల్దార్ వెంకట రమేష్‌బాబు సెలవులో వెళ్లారు. ఈనెల 9వ తేదీ నుంచి 24 వరకు సెలవు పెట్టారు. ఆయన స్థానంలో కర్నూలు అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మిని నియమించారు. రమేష్‌బాబు తండ్రి అనారోగ్యానికి గురికావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కార్యాలయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ నేపథ్యంలో తహసీల్దార్ రమేష్‌బాబు తన తండ్రి యోగక్షేమాలు చూసుకునేందుకు దాదాపు 15రోజులు సెలవులు పెట్టి వెళ్లినట్లు సమాచారం. అంత వరకు అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో సోమవారం మండలంలోని గొందిపర్లలో జరిగిన రెవెన్యూ సదస్సుకు కర్నూలు ఆర్డీవో కిడారి సందీప్‌కుమార్‌తోపాటు అర్బన్ తహసీల్దార్ హాజరయ్యారు. ఈసదస్సులో మొత్తం 14 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న అధికారులు

సి.బెళగల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు గ్రామ సచివాల యంలో 2023 నుంచి 2024 మార్చి నెల వరకు చేసిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో రాణెమ్మ మాట్లాడుతూ అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. ఈసమావేశంలో ఏపీవో లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజు, టెక్నికల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి విరాళం



సర్జికల్ అప్రాన్లతో సూపరింటెండెంట్, అశ్వినీ హాస్పిటల్ యజమాన్యం

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్య శాలకు అశ్వినీ హాస్పిటల్ రూ.2.16 లక్షలు విలువ చేసే సర్జికల్ అప్రాన్స్, టవల్స్‌ను విరాళంగా అందించింది. సోమవారం సూపరింటెండెంట్ చాంబరులో అశ్వినీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సి.శ్రీనివాసరెడ్డి, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు బి.సురేష్ కుమార్ 300 సర్జికల్ గౌన్లు, టవల్స్‌లను సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లుకు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డి.శ్రీరాములు, కే.సీతారామయ్య, అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ విశాల, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 జి.విమలమ్మ, సీనియర్ హెడ్ నర్సులు పి.లీలారాణి, జే.నిర్మల పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరిస్తాం

ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి

ఓర్వకల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తామని ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి అన్నారు. మండలంలోని నన్నూరు గ్రామ రెవెన్యూ సదస్సులో సోమవారం ఆమె పాల్గొన్నారు. ఈ సదస్సుకు తహసీల్దార్ విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాలను పరిష్కరించాలనే లక్ష్యంతోనే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, రెవెన్యూ సిబ్బంది అర్జీలు స్వీకరించాల అన్నారు. వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్జీలన్నింటినీ ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌లో నమోదు చేసి పూర్తి స్థాయి పరిశీలన చేసి త్వరితగతిన సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ సదస్సులో 250 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో భూ సమస్యలు ఆన్‌లైన్‌లో లేకపోవడం, పట్టాదారు పాసు పుస్తకాలు భూమి



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి

కొలతలు తదితర వాటిపై రైతులు, ప్రజలు అర్జీలు చేసుకున్నారు. అనంతరం గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకుని వీధుల్లో పర్యటించారు. కార్యక్రమంలో సర్వేయర్ శంకర్ మాణిక్యం, ఆర్ఐ పాణ్యం వెంకటేశ్వర్లు, ఈవో మద్దిలేటి, వీఆర్వోలు మోహన్, సోమన్న, పాల మద్దిలేటి, నాయ కులు విశ్వేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, ఖాజామియా, విజయుడు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వినతులు వచ్చాయి. టిడ్కో ఇళ్లు, డ్రైనేజీ, రోడ్లు నిర్మాణం, అక్రమ కట్టడాలు తదితర వాటిపై ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీ వీ.కృష్ణ, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎస్ఈ రాజశేఖర్, టిడ్కో అధికారి పెంచలయ్య, ఆర్‌ఓ జునైద్, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులు జీతాలు పెంచాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కార్మికులు జీతాలు పెంచాలని కోరుతూ రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా సోమవారం అశోక్‌నగర్ పంప్‌హౌస్ నుంచి నగర పాలక కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్తామని, ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారులకు సమ్మె నోటీసు ఇచ్చామని అన్నారు. గత ప్రభుత్వ పారిశుధ్య కార్మికులకు జీతంతోపాటు హెల్త్ అలవెన్సు పెంచి రూ.21వేలు, డ్రైవర్లకు రూ.24 వేలు మంజూరు చేసిందన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పని



కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు



గూడూరులో నిరసన తెలుపుతున్న కార్మికులు

చేసే కార్మికులకు ఎందుకు గుర్తించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి జి.రమేష్, జిల్లా అధ్యక్షుడు ఎస్.మనోహర్, కాశపోగు జ్ఞానమ్మ, జి.వెంకటేష్, జావీద్ పాల్గొన్నారు.

గూడూరు: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గూడూరు నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు ఆరవింద్, మధు, దూకేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం గూడూరులో కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్నికల్, నాన్ టెక్నికల్‌లకు వేతనం రూ.29,200/-, రూ.24,500/- ఇవ్వాల న్నారు. కార్యక్రమంలో బసవరాజు, షబ్బీర్ బాషా, హుసేన్ ఖాన్, ఖాజా హుసేన్, జయన్న, అల్లి బాషా, మధు, హరి పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆలిండియా డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు వై.నాగేశ్వ రరావు కోరారు. సోమవారం ఆయన కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రభుత్వ డ్రైవర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అనంతరం ఆలిండియా ప్రభుత్వ వాహన డ్రైవర్ల కాన్ఫడరేషన్ అధ్యక్షుడిగా నియమించినందుకు సభ్యులు ఆయనకు అభి నందనలు తెలిపారు. కార్యక్రమంలో డ్రైవర్ల సంఘం జిల్లా సెక్రటరీ మక్బూల్, కోశాధికారి గోవిందు, నాయకులు కె.శ్రీనివాసులు, అంజాద్ బాషా, ఏపీ హంసా కర్నూలు సిటీ అధ్యక్షుడు టి.గోవిందస్వామి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఊంజల సేవ



ఊంజల సేవలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లోని పేట మెయిన్ బజార్‌లోని శ్రీరామాలయంలో శతాబ్ది బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సీతారాముల వారికి ఊంజల సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఊయ్యాలలో ఉంచి పూజలు చేశారు. ఇందులో భాగంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో భక్తి సంగీత విభావరి నిర్వహించారు. విష్ణు సహస్ర నామ సత్సంగం అధ్యక్షుడు పుల్లారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీతలోని పదో అధ్యాయం విభూతి యోగంలోని అంశాలను పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి చిలుకూరి నందకిషోర్, అఖిల భారత కరివేన నిత్యాన్నదాన సత్రం నిర్వాహకుడు డాక్టర్ వేణు గోపాల్, ఆలయ ప్రధాన అర్చకులు హనుమేశాచార్యులు, సుధీంద్ర, కట్టా రాఘవేంద్ర ప్రసాద్, కె.సుధాకర్, వేదవ్యాస మూర్తి, శ్యామ్, సతీష్ పాల్గొన్నారు.

బద్రినాథ్ నగర్‌లో చోరీ

కర్నూలు క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బద్రినాథ్ నగర్‌లో చోరీ జరిగింది. హెచ్ఎస్ఎస్ కార్యాలయంలో పని చేసే మద్దిలేటి అనే వ్యక్తి ఇంట్లో ఈ చోరీ జరిగింది. మద్దిలేటి శనివారం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదు వెళ్లారు. సోమవారం సాయంత్రం ఇంటి తలుపులు పగలకొట్టి ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సోమవారం రాత్రి ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. ఇంటి యజమానికి ఫోన్‌లో సమాచారమిచ్చారు. వారు వచ్చిన తర్వాతనే చోరీకి గురైన సొత్తు వివరాలుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

వృద్ధుడిపై వైసీపీ నాయకుల దాడి

కర్నూలు క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో బస్తిపాడులో పొలం తగాదా విషయంలో బందే నవాజ్ అనే వృద్ధుడిపై వైసీపీ నాయకులు దాడి చేశారు. రమణారెడ్డి, ఆయన సోదరుడు రామ్మోహన్ రెడ్డిలు బందెనవాజ్ మధ్య పొలం విషయంలో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఇద్దరు అన్నదమ్ములతోపాటు మరో ఇద్దరు తనపై దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు విచారిస్తున్నామని ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

నెట్‌బాల్ ఎంపిక పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో సోమవారం జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రిటైర్డు డీఎస్పీ మహబూబ్ బాషా, అసోసియేషన్ అధ్యక్షుడునాగేశ్వరబాబు, కే.నాగరత్నమయ్య హాజరయ్యారు. ఈసందర్భంగా రిటైర్డు డీఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలన్నారు. నాగేశ్వరబాబు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో అండర్-14లో కొంతలపాడు విద్యార్థి నవీన్ జాతీయ స్థాయిలో పాల్గొంటున్న సందర్భంగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీలు వంశీకృష్ణ, కోచ్ చరణ్ పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన ఆదర్శ పాఠశాల బాలురు, బాలికలతోపాటు ఆర్.కొంతలపాడు బాలికలకు అతిథులు బహుమతులను అందజేశారు.

ఆర్‌యూ బ్యాడ్మింటన్ మహిళా జట్టుకు సత్కారం

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గత నవంబరు 26వ తేదీ నుంచి 30 వరకు వీటీయు బెళగాం ఆధ్వర్యంలో ముగిసిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ మహిళల టోర్నమెంటు రాయలసీమ విశ్వవిద్యాలయం బ్యాడ్మింటన్ మహిళా జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌కు యూనివర్సిటీ బ్యాడ్మింటన్ మహిళ జట్టు అర్హత సాధిచింది. ఈ సందర్భంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం క్రీడాకారులు, కోచ్‌లకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌యూ వైస్ చాన్సలర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బి.విజయకుమార్ నాయుడు హాజరై మాట్లాడారు. అద్భుతమైన విజయాన్ని సాధించినందుకు జట్టు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కోచ్‌లను, జట్టును సన్మానించారు. అనం తరం జట్టు సభ్యుల వివరాలు తెలియజేశారు. ఎం.ఆకాంక్ష, ఎన్.జాహ్నవి, సీహెచ్ఎస్ఆర్ ప్రణవి, ఎఫ్.షరీన్, ఎల్.మమైక్య, సభ్యులుగా ఉన్నారనీ జట్టు మేనేజర్ కోచ్ జి.మేమంత్ రెడ్డి వ్యవహరించారు. యూనివర్సిటీ గేమ్స్‌ను ఏప్రిల్, మే నెలలో నిర్వహిస్తామని ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ కేవీ శివకిషోర్ తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ డిగ్రీ కాలేజీ పీడీ విజయ కుమారి పాల్గొన్నారు.

వికసిత్ భారత్ క్విజ్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): భారత యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో మై భారత్ పోర్టల్‌లో వికసిత్ భారత్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నారని సెట్కూరు సీఈవో దీప్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల యువత ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.లక్ష, రూ.75వేలు, రూ.50వేలు తదుపరి వంద స్థానాల్లో నిలిచిన వారికి ఒక్కొక్కరికి రూ.2వేలు, వంద నుంచి 200 వరకు స్థానాల్లో నిలిచిన వారికి రూ.2 వేలు నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు. వెబ్‌సైట్ మైభారత్.జీవోవి.ఇన్ పోర్టల్‌లో లాగిన్ అయి పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 10వ తేదీ ఉమ్మడి జిల్లాల నుంచి 15 నుంచి 29 సంవత్సరాల యువత పాల్గొనాలని తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఏవో

సి.బెళగల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌పై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో పొగాకు, వరి సాగుచేసిన రైతులకు ఈనెల 11 తేదీ నుంచి ప్రారంభమయ్యే తుఫాన్ నుంచి పంటలను కాపాడుకోవడానికి మెళకువలు తెలిపారు. అనంతరం ఆయన పొగాకు పంటను పరిశీలించారు. ఏవో వెంట ఎంపీఈవోలు రైతులు ఉన్నారు.



పొగాకు పంటను పరిశీలిస్తున్న ఏవో

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఆదోని బీసీ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ హాస్టల్ లో మెనూ పాటించడం లేదని, విద్యార్థులతో పని చేయిస్తున్నారని అన్నారు. విద్యార్థులను వార్డెన్ అసభ్య పదజాలంతో దూషిస్తుందన్నారు. కార్యక్రమంలో పవన్, అస్లాం బాషా, దామోదర్ పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయాధికారిపై చర్యలు తీసుకోవాలి: జిల్లా వ్యవసాయ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఎస్ఎఫ్ నాయకులు మహేంద్ర కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఫర్టిలైజర్, క్రిమిసంహారక డీలర్ల నుంచి అక్రమ వసూలు చేస్తున్న మండల వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. మండల వ్యవసాయాధికారులకు వత్తాసు పలుకుతున్న జిల్లా వ్యవసాయాధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దివాకర్, వంశీ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఔట్‌సోర్సింగ్ కార్మికులు బకాయి వేతనాలు చెల్లించాలని, పర్మినెంట్ కార్మికులకు గత మూడేళ్లుగాగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, డీఏ చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి చంద్ర శేఖర్, మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి పి.మద్దిలేటి, రామాంజనేయులు, ఈశ్వర్, పురుషోత్తం పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఐ



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, మహిళలు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలు నెరవేర్చడంలేదన్నారు. పేదలకు రెండు సెంట్ల స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇవ్వాలన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, నాగరాజు, దేవిభాయ్, రాముడు పాల్గొన్నారు.

మేధా సంపత్తి హక్కులపై అవగాహన

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పుల్లయ్య ఇంజ నీరింగ్ కళాశాలలో మేధా సంపత్తి హక్కులపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఎంఎస్ఎంఈ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కాపీ రైట్, ట్రేడ్ మార్కులు, పేటెంట్లు, మౌలిక సూచనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ (ఎంఎస్ఎంఈ) వి.స్వప్న, డా.హెచ్ఎస్ అఫ్జల్ బాషా, చిన్న, మధ్యతరగతి వ్యాపారులు, ఫస్ట్ ఈయర్ ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు వైద్య విద్యార్థులకు గాయాలు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం కె.నాగులాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వైద్య విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కె.నాగులాపురం ఎస్ఐ ఆశాలత తెలిపారు. కే నాగులాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వభారతి మెడికల్ కాలేజీకి చెందిన ఇద్దరు వైద్య విద్యార్థులు నాగులాపురానికి బైక్‌పై వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది.

ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలి



ప్రవచనాలు బోధిస్తున్న ధార్మికవేత్త వీఎస్ఆర్ మూర్తి

కర్నూలు కల్చరల్ డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని ధార్మికవేత్త, హైదరాబాదుకు చెందిన బ్రహ్మశ్రీ వీఎస్ఆర్ మూర్తి అన్నారు. నగరంలోని స్వామి విద్యాప్రకాశానంద గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల భగవద్గీత జ్ఞాన యజ్ఞ ప్రవచనాల కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా విచ్చేసి భక్తులకు ప్రవచన బోధ చేశారు. నగరంలోని సంకల్‌బాగ్‌లోగల గీతా ప్రచార ధామం సమావేశ హాలులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వీఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ భగవద్గీతను సంపూర్ణంగా అధ్యాయనం చేయాలంటే ఒకటి రెండు రోజులు సరిపోవని చెప్పారు. గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ మాట్లాడుతూ ఈనెల 11న గీతా జయంతిని పురస్కరించుకొని రెండు రోజుల జ్ఞాన యజ్ఞంతోపాటూ బుధవారం వెయ్యి మంది భక్తులతో భగవగ్గీత సహస గళ పారాయణం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు జగన్నాథగుప్త, మహబలేష్ పాల్గొన్నారు.

ఉషూ పోటీల్లో విద్యార్థులకు పతకాలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కిడ్స్ వరల్డ్‌లో ఈనెల 8న జరిగిన జిల్లా స్థాయి ఉషూ పోటీలలో జేఎంజే పాఠశాల విద్యార్థులు 27 పతకాలు సాధించారు. సోమవారం పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన సభలో హెచ్ఎం రెవ.ఎలిజబెత్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పతకాలను అందజేసి అభినందించారు.

నేడు జూటూరులో రెవెన్యూ సదస్సు

పత్తికొండ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూటూరు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు ఉంటుందని తహసీల్దార్ రమేష్ సోమవారం తెలిపారు. రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

టీడీపీ సభ్యత్వంతో బీమా



నాయకులను సన్మానిస్తున్న గ్రామస్థులు

ఆదోని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో రూ.5లక్షల బీమా వర్తిస్తుందని ఆ పార్టీ నాయకుడు ఉమాపతి నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని దిబ్బనకల్లు గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు సూచన మేరకు దిబ్బనకట్లులో సభ్యత్వ నమోదు చేపట్టామన్నారు. రంగస్వామి నాయుడు, దిబ్బనకల్లు సర్పంచ్ లక్ష్మన్న, వల్లమన్న, రంగన్న, దొడ్డనగిరి శివప్ప, బసవరాజు, రామస్వామి, మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప, వెంకటేష్, కృష్ణారెడ్డి, ప్రతాప్ రెడ్డి, మల్లికార్జున, జైరామ్, రవి, అయ్యప్ప, నాగరాజ్, బాబు నాయుడు, సయ్యద్ బాషా పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ఆదోని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా, సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను ప్రతిపక్ష నేతగా చంద్రబాబు వ్యతిరేకించారని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ప్రజలపై విద్యుత్ భారం మోపడం దారుణమన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు సుదర్శన్, లక్ష్మీ నారాయణ, గోపాల్, లక్ష్మీరెడ్డి, కల్లుబావి రాజు, కుమారస్వామి, లింగప్ప, రవి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతేకూడ్లూరు ఎంపీపీ పాఠశాల ఎస్జీ ఉపాధ్యాయుడు శ్రీనివాసుని సస్పెండ్ చేస్తూ డీఈవో సామెల్ పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం తాగి పాఠశాలకు వస్తున్నారని, విద్యార్థులను కొడుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. విచారణలో నిరూపణ కావడంతో సస్పెండ్ చేశారు. దీనిపై ఎంఈవో-2 శ్రీనివాసులును వివరణ కోరగా సస్పెన్షన్‌ను ధ్రువీకరించారు.

గర్భిణులకు పౌష్టికాహారం



గర్భిణులకు ఆహారం వడ్డిస్తున్న వైద్యురాలు కల్పన

పత్తికొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు టీడీపీ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందించారు. ప్రతినెల 9వతేదీన స్కానింగ్‌కు గర్భిణులకు సమీప, దూర ప్రాంతాల గర్భినులు వస్తారు. వీరికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సొంతఖర్చులతో పౌష్టికాహారాన్ని అందించే ఏర్పాటుచేశారు. సోమవారం వైద్యాధికారి కల్పన ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఆహారాన్ని వడ్డించారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ దిగుబడిని కనీస మద్దతు ధరతో ప్రభుతమే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని మార్కెట్ యార్డ్‌లో వేరుశనగ రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.6,783ల కంటే తక్కువకే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులు క్వింటానికి రూ.వెయ్యికి పైగా తక్కువకు అమ్ముకొని నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

పింఛన్లపై విచారణ



గ్రామస్థులను విచారిస్తున్న అధికారులు

క్రిష్ణగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరుకల చెరువు గ్రామంలో సోమవారం పింఛన్లపై విచారణ నిర్వహించారు. కర్నూలు ఈవోఆర్డీ అనురాధ నేతృత్వంలో విచారణ బృందం 349 మంది లబ్ధిదారుల వివరాలను సేకరించారు. వీరిలో 24మంది బ్రతుకుదెరువుకోసం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లారని, వీరిని నేడు విచారణ చేస్తామని, నివేదికను ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఎంపీడీవో మోహన్‌కుమార్ ఉన్నారు.

చందాలతో బాత్‌రూమ్‌ల నిర్మాణం

తుగ్గలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): లక్ష్మి తండాలో ప్రభుత్వ పాఠశాలకు మరుగుదొడ్లు లేకపోవడంతో గ్రామస్థులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, గ్రామస్థులు చందాలు పోగు చేసుకుని బాత్‌రూములను నిర్మించారు. రూ.40వేలతో వీటిని నిర్మించామని టీడీపీ నాయకులు జయరాజ్, మీటే నాయక్ అన్నారు. సోమవారం వీటిని ప్రారంభించారు.



బాత్‌రూమ్‌లను ప్రారంభిస్తున్న గ్రామస్థులు

శనగ రైతు దిగులు

- తెగులుతో కుళ్లిపోతున్న కాండం
- దిగుబడి రాదని ఆందోళన



శనగ పంట, ఇన్‌సెట్‌లో తెగులు సోకిన మొక్క

మద్దికెర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 గ్రామాల్లో 20వేల ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశారు. ఈ ఏడాది వర్షాలు బాగా పడటంతో పంట ఆశాజనకంగా ఉంది. దీంతో రైతులు సంతోషపడ్డారు. అయితే మూడు రోజుల పంటకు ఎర్ర తెగులు సోకి, కాండం కుళ్లిపోయి పంట ఎర్రబారుతోంది. దీంతో పంట ఎండిపోయి దిగుబడి వచ్చే అవకాశం లేకుండా ఉంది. ఎకరాకు రూ.12వేల పెట్టుబడి పెట్టామని ఇలా అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టానుసారంగా మందుల వాడకం..

ఎలాగైనా పంటను కాపాడుకోవాలనే ఆతృతతో రైతులు ఇష్టానుసారంగా పురుగుమందులు వాడినట్లు తెలుస్తోంది. దుకాణాల యజమానులు ఏవి ఇస్తే వాటిని పిచికారీ చేశారు. అయినా మార్పు రాలేదు. దీంతో ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికా రులు పంటను పరిశీలించి, తగు సూచనలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పంట ఎండిపోతోంది



అయిదెకరాల్లో శనగ సాగు చేశాను. వర్షాలు బాగా కురవడంతో పంట ఆశాజనకంగా ఉంది, పూత పట్టింది. అయితే తెగులు సోకి కాండం పనిపోతుంది. ప్రభుత్వం ఆదుకోవాలి. చేస్తున్నారు. **- చంద్రశేఖర్, బురుజుల**

వ్యవసాయ అధికారులను సమప్రదించాలి



పంటలకు తెగుళ్లు వస్తే రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. మాకు సమాచారం ఇస్తే పొలాలకు వెళ్లి పంటలను పరిశీలించి, సూచనలు ఇస్తాం. **- రవి, ఏవో**

కాంప్లెక్స్ పనులను ప్రారంభించాలి

ఆదోని టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత బస్టాండ్ స్థలంలో ఆగిపోయిన మెగా కమర్షియల్ కాంప్లెక్స్ పనులను పునఃప్రారంభించాలని సామాజిక కార్యకర్త నసీరుద్దీన్ పటేల్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ వేలంపాటలో షాపులను దక్కించుకున్న వ్యాపారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి అయితే పురపాలక సంఘానికి భారీగా ఆదాయం సమకూరుతుందని అన్నారు.

ఇప్పుడు చెల్లిపులా?

గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులకు ఇప్పుడు నిధులు ఎలా చెల్లిస్తారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్ ప్రశ్నించారు. సోమవారం మాట్లాడుతూ జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే పార్థసారథి జిల్లా అధికారులను నిలదీయడం సమంజసమన్నారు.

సమస్యలను వేగంగా పరిష్కరించండి

ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



అర్జీలను స్వీకరిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని

1. కొన్నేళ్ల కిందట తెలంగాణకు వలస వెళ్లి మరలా వచ్చామని పెద్దకడబూరు మండలం కంబలదిన్నె గ్రామానికి తిరిగి వచ్చి పనులు చేసుకుంటున్నామని రేషన్ కార్డు మంజూరు చేయాలని అంబుజ అర్జీ సమర్పించుకున్నారు.
2. కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన సురేష్‌కు తనకు సర్వే నెంబర్ 423లో డీ-పట్టా ఇచ్చారని, పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని అర్జీ ఇచ్చారు.
3. ఆదోని మండలం సంతెకుడ్లూరు గ్రామానికి చెందిన యల్లమ్మ తనకు సర్వే నెంబర్ 5 లో 2.12 ఎకరాల భూమి ఉందని, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించుకున్నారు.
4. తన తల్లి లక్ష్మి నరాల సమస్య, పక్షవాతంతో మంచానికే పరితిమైందని, పెన్షన్ మంజూరు చేయాలని సురేష్ అర్జీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాస రాజు, వేణు సూర్య, హౌసింగ్ డీఈ రవి కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్ ప్రియ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, ఆర్&బీ డీఈ వెంకటేశ్వరులు, డిప్యూటీ డీఈవో వెంకటరమణ రెడ్డి పాల్గొన్నారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

ఆదోని అగ్రికల్చర్: బీసీ బాలికల కళాశాల విద్యార్థినులచే పనులు చేయిస్తున్న వార్డెన్ ప్రమీలమ్మను సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ్ సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజకు వినతిపత్రం అందజేశారు. రెండు రోజుల క్రితం విద్యార్థినులచే కూరగాయలను కోయించి, నీరు మోయించాడని ఆరోపించారు. నాయకులు రసూల్ వీరేష్, సంతోష్, రవి పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మె బాట



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఆదోని టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మె బాట పడతామని మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు అహ్మద్ హుస్సేన్, పీరా సాబ్, సోమన్న అన్నారు. సోమవారం నిరసన తెలిపి చైర్ పర్సన్ వాల్మీకి శాంతకు వినతి పత్రం ఇచ్చారు. తమ డిమాండ్లను పరిష్కరించడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా తమకు చర్చలకు పిలవక పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రేపటి నుండి అంచెలంచెలుగా సమ్మె బాటలోకి వెళ్తున్నట్లు తెలిపారు. కృష్ణమూర్తి, కర్రెన్న పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలి



డీఈ మల్లికార్జునయ్యకు మెరపెట్టుకుంటున్న కాంట్రాక్టర్

ఆలూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని చింతకుంట జలాశయం నిర్వాహణకు సంబంధించిన 12 నెలల బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్ నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్యకు విజ్ఞప్తి చేశారు. జలాశయం నుంచి గ్రామాలకు నిత్యం తాగునీరు సరఫరా చేశామని, అప్పు చేసి పైపులైన్లు, మోటర్లు మరమ్మత్తు చేయించామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు.

రాక్షస పాలన నుంచి రైతులకు విముక్తి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దారెడ్డి

ఆదోని రూరల్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ రాక్షస పాలన నుంచి రైతులకు విముక్తి కలిగిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దారెడ్డి అన్నారు. తహసీల్దార్ శివరాముడు అధ్యక్షతన సోమవారం మండిగిరి పంచాయతీలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంలో రైతుల, ప్రజల, భూములను వైసీపీ నాయకులు కబ్జాలు చేశారని ఆరోపించారు. వారిపై సుమోటో కేసులు పెట్టాలన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిశీలించి 45 రోజుల్లోపు పరిష్కరిస్తామన్నారు. డీఎల్‌పీవో నూర్జహాన్, బీజేపీ నాయకుడు విట్టా రమేష్, నాగరాజు గౌడ్, టీడీపీ నాయకుడు, మండిగిరి సుదర్శన్ రావు, వీఆర్వో రాజశేఖర్ గౌడ్, పాల్గొన్నారు.

భూసార పరీక్షల పత్రాలు పంపిణీ

దేవనకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల పత్రాలను ఏడీఏ మోహన్‌విజయ్, ఇన్‌చార్జి ఏవో మున్నెమ్మ రైతులకు పంపిణీ చేశారు. పరీక్షలతో పోషకాల విలువలతోపాటు, సాగు చేసే పంటలకు వాడాల్సి ఎరువులు, మందులు వివరాలు తెలుస్తాయన్నారు. ఏఈవోలు రంగన్న, సలాం, మల్లికార్జున, రంగాచారి ఉన్నారు.

సీపీఎం సభలను జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న సీపీఎం మండల మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు చక్రాళ్ల వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మాట్లాడుతూ పట్టణంలోని ఈశ్వర్ రెడ్డి భవనంలో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు.

కబడ్డీలో హాస్టల్ విద్యార్థుల విజయం

తుగ్గలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉరుసు సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో హాస్టల్ విద్యార్థులు విజయం సాధించారు. రన్నరప్‌గా గ్రామానికి చెందిన విద్యార్థులు నిలిచారు. విజేతలకు టీడీపీ నాయకులు బాలన్న, మిద్దె వెంకటేశ్ యాదవ్, రవి యాదవ్, సర్పంచు ఓబులేసు, రాజు, లక్ష్మణస్వామి యాదవ్ బహుమతి ఇచ్చారు.

యంత్రాలతో అధిక దిగుబడి

మద్దికెర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో యంత్రాలు వినియోగంతో అధిక దిగుబడి వస్తుందని, కూలీల ఖర్చు కూడా ఆదావుతుందని ఏవో రవి అన్నారు. సోమవారం ఎం.అగ్రహారం, మద్దికెర గ్రామాల్లో ట్రాక్టర్ భూమ్ ద్వారా స్ప్రేయర్‌ను పరిశీలించారు. ఈ స్ప్రేయర్‌తో ఒక్కరోజుల్లో 70-80 ఎకరాల్లో పప్పుశనగ పంటకు మందు పిచికారీ చేయవచ్చన్నారు. సిబ్బంది జాకీర్ తదితరులు ఉన్నారు.

సూర్యఘర్‌ను వినియోగించుకోండి

పత్తికొండ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని విద్యుత్ డీఈఈ ఖాజావలి, ఏఈ నారాయణ స్వామి కోరారు. సోమవారం విద్యుత్ కార్యాలయంలో వాల్‌పోస్టర్ కటౌట్‌ను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఇంటి పైకప్పుపై వంద చదరపు అడుగుల్లో కిలో వాట్ ద్వారా 120 యూనిట్లు ఉత్పత్తి అవుతుందని, విద్యుత్ బిల్లులు ఆదా అవుతుందన్నారు. వినియోగదారులు ఏపీఎస్‌డీపీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా గానీ, ప్రధానిమంత్రి సూర్యఘర్ పోర్టల్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమాచారం 1912 నెంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

'ప్రకృతి' సాగుతో ఆరోగ్యం

వెల్దుర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన కూరగాయలతో ఆరోగ్యం పదిలమని ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్లు జనార్ధన్, ముని రాజు అన్నారు. సోమవారం రైతుసేవా కేంద్రం వద్ద స్టాల్ ఏర్పాటుచేసి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించారు. ప్రతి సోమవారం రైతుసేవా కేంద్రం వద్ద విక్రయి స్తామన్నారు.

ఘనంగా సర్ జాన్ మిల్టన్ జయంతి



జాన్ మిల్టన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి గొప్ప తత్వవేత్త సరే జాన్ మిల్టన్ జయంతిని సోమవారం మిల్టన్ గ్రామర్ పాఠశాలలో నిర్వహించారు. కరస్పాండెంట్ రమేష్ బాబు ప్రిన్సిపాల్ నాగరాజు జాన్ మిల్టన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. జాన్ మిల్టన్ జీవితం యువతకు ఆదర్శమన్నారు. రెండు కళ్ళు పోగొట్టుకున్నా, వెనుకడుగు వేయకుండా పద్యాలను రాసి ప్రపంచ కవిగా గుర్తింపు పొందారన్నారు. సీఈవో వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ రంగస్వామి, సుశీల, లావణ్య, జయసింహ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోండి

హాలహర్వి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. సోమవారం ఆధార్ కేంద్రానన్ని ప్రారంభించారు. గ్రామాల ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

లక్ష దీపోత్సవం

హాలహర్వి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.హోసళ్ళి గ్రామంలో పీఠాధిపతి శంభులింగస్వామి ఆధ్వర్యంలో సోమవారం లక్షదీపోత్సవం నిర్వహించారు. వారణాసి పీఠాధిపతి మల్లికార్జున శివారధ్యాశివా పల్లకోత్సవంతో ఊరేగింపు కొనసాగింది. ముఖ్య అతిథి ఆలూరు ఎమ్మెల్యే వీరుపాక్షి సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠం వద్ద లక్ష దీపోత్సవం వెలిగించారు.

సమస్యలను పరిష్కరిస్తాం

మద్దికెర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపా, బసినేపల్లి, బురుజుల గ్రామాల్లో రీసర్వే ద్వారా రైతుల రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ అన్నారు. సోమవారం హంపా గ్రామంలో రీసర్వేను ఆయన పరిశీలించారు.

ఇరు వర్గాల వివాదం

ఆలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొలగవల్లి చెన్నకేశవ ఉత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు గ్రామానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. మున్ముందు ఘర్షణలు చోటు చేసుకోకుండా ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్ సోమవారం గ్రామానికి చేరుకుని ఇరు సామాజికవర్గాలతో మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఘర్షణలు చేసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఘర్షణలకు ప్రోత్సహించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండేలా సహకరించాలని కోరారు.

సారూ.. ఇదేం తీరు..

- నెట్‌వర్క్ లేదని ఇళ్లకు వెళ్లిపోయిన అధికారులు
- ప్రజా వేదిక లేక నిరాశతో వెనుదిరిగిన ప్రజలు



అధికారులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

హోళగుంద, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 16 శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉంది. అయితే హోళగుంద తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో నెట్‌వర్క్ లేదని అధికారులు వెళ్లిపోయారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఎంపీడీవో, ఈవోఆర్డీ అధికారులు తమ కార్యాలయాల్లో జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయంపై ఎంపీడీవో విజయ లలితను వివరణ కోరగా తాను జూమ్ మీటింగ్‌కు హాజరయ్యానని మిగతా అధికారుల విషయం తనకు తెలియదన్నారు.

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- దేవనకొండ సీఐ వంశీనాథ్



దేవనకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని సీఐ వంశీనాథ్ హెచ్చరించారు. ఆయన ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: మండలంలో సమస్యాత్మక గ్రామాలు ఏన్ని ?

జవాబు: పి.కోటకొండ, వెలమకూరు, కుంకనూరు, గ్రామాలు సమస్యాత్మకంగా ఉన్నాయి. ఈ గ్రామాలపై నిఘా ఉంచాం.

ప్రశ్న: మండలంలో ఎంతమంది రౌడీషీటర్లు ఉన్నారు?

జవాబు: మండలంలోని 44 గ్రామాల్లో 82 మందిపై కేసులున్నాయి. రౌడీషీటర్లు 26 మంది, అనుమానితులు 45, కేడీలు 2, మరో 9మంది ప్రమాదకర వ్యక్తులు ఉన్నారు. వీరి కదలికలపై నిఘా పెట్టాము

ప్రశ్న: భూ సమస్యలపై ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: భూతగదాలతో వచ్చేవారి సమస్యను బట్టి, ఇరువర్గాలతో మాట్లాడి వివాదం లేకుండా చూస్తున్నాం. మా పరిధి దాటితే రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకెళ్తున్నాం.

ప్రశ్న: ఇసుక అక్రమ రవాణపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఇసుకను అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేసి చర్యలు తీసుకుంటాము.

ప్రశ్న: ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన వారిపై ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ద్విచక్ర వాహనదారులు త్రిబుల్ రైడింగ్, అతి వేగంతో వెళ్తే రూ.వెయ్యి, హెల్మెట్ దరించకపోతే రూ. వంద, లైసెన్స్ లేకపోతే జరిమాన విధిస్తాం.

ప్రశ్న: సైబర్ మోసాల నుంచి ఎలి తప్పించుకోవాలి?

జవాబు: సెల్‌ఫోన్‌కు వచ్చే అనుమానిత కాల్స్, లింకులపై క్లిక్ చేయకూడదు. వ్యక్తిగత సమాచారాన్ని చెప్పకుడదు. ఓటీపీ పిన్, బ్యాంకు పాస్ వర్డులు గోప్యంగా ఉంచుకోవాలి. ఫేక్ ప్రొఫైల్‌తో మోసం చేసే వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో డబ్బులు అడిగితే పంపకూ డదు. సైబర్ నేరాల బారినపడితే 1930 ఫిర్యాదు చేయండి.

ఆహ్లాదం కరువు!

● అభివృద్ధికి నోచుకోని మున్సిపల్ పార్కులు ● ప్రహరీలు కట్టి వదిలేస్తున్న వైనం

ఎమ్మిగనూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆహ్లాదం కరువుతోంది. ఉరుకుల పరుగుల జీవితంలో కాస్త సమయం దొరికితే సేదతీరటానికి ఉద్యానవనాలు ఎంతో అవసరం. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు సెలవు రోజుల్లో కొద్దిసేపు ఆటలాడితే వారికేంతో ఉపశమనం లభిస్తుంది. కాని ఉదయం, సాయంత్రం వేళల్లో సెవుదినాల్లో ఉద్యానవనాల్లో పిల్లలు, పెద్దలు సేదతీరటానికి అవకాశం లేకుండాపోతోంది. మున్సిపాలిటీ పరిధిలో ఉద్యానవనాల పట్ల శ్రద్ధ కరువయ్యిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


పెద్ద పార్కులో కనిపించని పచ్చిక


తిరుమల నగర్‌లో పార్కుకు కేటాయించిన స్థలం దుస్థితి

ఎమ్మిగనూరు పురవాసులకు ఆహ్లాదం బహుదూరంగా కనిపిస్తోంది. ఏళ్లు గడుస్తున్న పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో పట్టణవాసులు సేదతీరేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఒకప్పుడు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎదురుగా రహదారిని ఆనుకొని ఒక పార్కు(చిన్న పార్కు), వీవర్స్ కాలనీ మైదానాన్ని ఆనుకొని మరో పార్కు(పెద్దపార్కు), గాంధీనగర్‌లో తారకరామ పార్కులు ఉండేవి. కాలక్రమేణ ప్రభుత్వ అవసరాలను దృష్టిలో పెట్టుకొని చిన్న పార్కులో మున్సిపల్ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. దీంతో పట్టణవాసులకు రెండు పార్కులు మిగిలాయి. గాంధీనగర్‌లోని పార్కు ఆరంభంలో అలరించిన కొంకాలం నిర్లక్ష్యానికి గురై మూతపడింది. దాన్ని మున్సిపల్ అధికారులు తిరిగి ఆధునీకరించి చిన్నారులకు అవసరమైన ఆటవస్తువులు ఏర్పాటు చేశారు. అది కేవలం సాయంత్ర పూట మాత్రమే తెరుస్తున్నారు. దీంతో ఇక్కడ పగలు విశ్రాంతి తీసుకునే అవకాశం లేదు. ఇకపెద్ద పార్కు పేరుకే పెద్ద పార్కుగా మారింది. పార్కులో పెద్ద పెద్ద చెట్లు ఉన్నాయో తప్ప పచ్చిక కనిపించడం లేదు. పార్కులో గతంలో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు ధ్వంసమయ్యాయి. పీట లేని ఊయల, విరిగిన జారుడు బండ, కూర్చునేందుకు పీటలు లేని త్రాచు వంటి ఆటవస్తువులు ఉన్నాయి. దీంతో చిన్నారులు సెలవు రోజుల్లో పార్కులో ఆడుకునేందుకు మక్కువ చూపటం లేదు. పార్కులో ఉన్న వాటర్ పాల్ చెత్తతో నిండిపోయి కనిపిస్తోంది.

● ప్రహరీలు కట్టి వదిలేశారు..

పట్టణంలో ఆయా ప్రాంతాల్లో వెంచర్లు ఏర్పాటు చేసిన సమయంలో పార్కులకోసం కొంత స్థలాన్ని వదిలారు. మున్సిపల్ అధికారులు ఆయా ప్రాంతాల్లో ఆ స్థలాలకు ప్రహరీలు కట్టి వదిలేశారు. ప్రధానంగా తిరుమల నగర్, న్యూ ఇందిరాకాలనీ, అయ్యప్ప స్వామి ఆలయం పక్కన, మంత్రాలయం రోడ్డులోని శ్రీనివాస నగర్, రామకృష్ణస్వామి మఠంతో పాటు ఆయా ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేసిన దాఖలాలు కనిపించటం లేదు.


న్యూ ఇందిరా కాలనీలో పార్కుకు కేటాయించిన స్థలంలో పెరిగిన ముళ్ల కంపలు


అడుకుంటున్న చిన్నారులు


పెద్ద పార్కులోని వాటర్ ఫాల్స్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారం

పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



పట్టణంలో పార్కుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఒకటి రెండు పార్కులు ఉన్నా అవి చిన్నారులకు పెద్దగా ఉపయోగంగా లేవు. పెద్ద పార్కులో ఆటవస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి.

- వీరేష్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ, జిల్లా అధ్యక్షుడు

రూ.5 కోట్లతో పార్కుల అభివృద్ధికి చర్యలు



ఎమ్మిగనూరులోని రూ.5కోట్లతో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. రూ. 3కోట్ల మున్సిపల్ నిధులతో ఆయా పార్కుల అభివృద్ధికి, రూ. 2కోట్లతో సంజీవయ్య నగర్ ప్రాంతంలో ఉన్న పార్కును ఏపీ అర్బన్ గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ అభివృద్ధి చేసుంది. ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయి. మూడు నెలల్లో పనులు ప్రారంభమవుతాయి.

-గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

అందరి సహకారంతో ఆలయం అభివృద్ధి : డీసీ


సమావేశంలో మాట్లాడుతున్న డీసీ విజయరాజు

కౌతాళం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతోనే ఆలయాన్ని అభివృద్ధి చేసుకుందామని ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజయ్ రాజు అన్నారు. సోమవారం ఆలయ ఆవరణలో గ్రామ పెద్దలు, భక్తులు, రాజకీయ నాయకులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఆలయం వద్ద దాతలు కట్టించిన అతిథి గదులపై చర్చించారు. కొందరు దాతలు మాట్లాడుతూ తాము కట్టించిన గదులను స్వామివారి దర్శనానికి వచ్చినప్పుడు తమకు కేటాయించాలని కోరగా, శ్రావణ మాసంలో మాత్రం దాతలకు ఒకసారి ఉచితంగా ఇస్తామని, మిగతా సమయాలలో నామ మాత్రపు అద్దె చెల్లించి దేవాలయ అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. అలాగే అన్నదానంలో కూడా మెనూ మార్చామని ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం భక్తులకు అందిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి గ్రామపెద్దలు, భక్తులు, రాజకీయ నాయకులు సహకారం అందిస్తే మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఉరుకుంద ఈరన్న స్వామి ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చెన్నబసప్ప, మాజీ సభ్యులు కోట్రేష్‌గౌడ్, భక్తులు సంజీవరెడ్డి, ఈరప్ప, నాగరాజు గ్రామస్థులు సురేంద్ర, ఎంపీటీసీ ఈరన్న, కురుగోడు, అయ్యప్ప, మహదేవ పాల్గొన్నారు.

రమణీయం.. రాఘవేంద్రుడి స్వర్ణ పల్లకోత్సవం


స్వర్ణపల్లకిలో ఊరేగుతున్న రాఘవేంద్రుడు

మంత్రాలయం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పల్లకోత్సవం రమణీయంగా సాగింది. సోమవారం మార్గశిర నవమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్ఠించి ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ చేశారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది.

రాఘవేంద్రుడి సన్నిధిలో నాగసాధువులు

రాఘవేంద్ర స్వామిని సోమవారం నాగసాధువులు దర్శించుకున్నారు. సాధారణ భక్తులులాగానే గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులను కలిశారు. నాగసాధువులు చేసే పూజలు, జీవనవిధానం, హిందూ ధర్మ పరిరక్షణ వంటి అంశాలను వివరించారు. అనంతరం వారికి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.


నాగసాధువులతో మాట్లడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

కష్టపడితేనే గుర్తింపు

పెద్దకడబూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏ రంగంలోనైనా కష్టపడితేనే మంచి గుర్తింపు లభిస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం టీడీపీ సోషల్ మీడియాలో ప్రతిభచాటిన తలారి అంజిని ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్ముకున్న వృత్తికి న్యాయం చేస్తూ..ప్రతిభను కనబరిస్తే గుర్తింపు పొందవచ్చని తెలిపారు.


తలారి అంజిని సన్మానిస్తున్న రాఘవేంద్రరెడ్డి

ఆత్మకూరులో చోరీ

ఆత్మకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని స్వరాజ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఆదిలక్ష్మీ అనే మహిళ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆదిలక్ష్మీ ఈ నెల 7వ తేదీన బెంగుళూరుకు వెళ్లారు. ఇదే అదునుగా దొంగలు పక్కా ప్రణాళికతో ఇంటి తలుపులకు ఉన్న తాళాన్ని పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. అల్మారీలో ఉన్న బీరువా తాళాలతో గుర్తించి దర్జాగా బీరువా తెరిచి అందుల రూ.1.7లక్షల నగదు, 3తులాల బంగారు, 10తులాల వెండిని అపహరించారు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చిన ఆమె ఇంట్లో దొంగలు పడిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

శివారు కాలనీల

అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం ఎల్లమ్మ బీడు ప్రాంతంలో కమిషనర్ గంగిరెడ్డి, డీఈ, ఏఈలతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. కాలనీలో రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్, తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే శివారు కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టణాభివృద్ధిని విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణంలో అభివృద్ధిని వేగవంతం చేశామన్నారు. ఏఐబీ కింద శివారు కాలనీల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ పార్వతి, వార్డు నాయకులు క్యాబర్ని శ్రీనివాసులు, దేవేంద్ర, పట్టా నాగరాజు, యుజీ ప్రకాష్, నాగరాజు, శంకర్, కామర్తి మహేష్,గరిలు పాల్గొన్నారు.

ఆరెకంటి నాగేశ్వరరావుకు కవిరత్న బిరుదు


అవార్డును అందుకుంటున్న ఆరెకంటి నాగేశ్వరరావు

గోనెగండ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో పెద్దమరివీడు పాఠశాల ఉపాధ్యాయుడు నాగేశ్వరరావుకు కవిరత్న బిరుదు వచ్చింది. ఆదరణ వెల్ఫేర్ సొసైటీ 10వ వార్షికోత్స కార్యక్రమం ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఈనెల 8న నిర్వహించారు. తెలుగు బాషా గొప్పతనం అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల నుంచే 75మంది కవులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో నాగేశ్వరరావుకు కవిరత్న పురస్కారం లభించింది. న్యాయ నిర్ణేతలు నాగేశ్వరరావును సత్కరించి ప్రశంసపత్రం అందజేశారు. నాగేశ్వరరావును, ఉపాధ్యాయులు సన్మానించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని గార్లదిన్నె క్రాస్ రోడ్డు సమీపంలో బొలెరో వాహనంలో తరలిస్తున్న 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండంలోని ఏనుగుబాల గ్రామానికి చెందిన రెడ్డి ఉదయ్ కిరణ్‌రెడ్డి, రెడ్డిపెద్దిరెడ్డిలతో పాటు మరో వ్యక్తి కలిసి రేషన్ బియ్యాన్ని సేకరించారు. అలాగే ఎమ్మిగనూరుకు చెందిన ఎరుకలి ఈరన్న, ఎరుకలి తిమ్మప్ప సహకరించారన్నారు. బియ్యాన్ని పార్లపల్లి గ్రామంలో ఉన్న ఓ మినీ రైస్‌మిల్లులో నూకలుగా తయారు చేసి ప్రజలకు అధిక మొత్తంలో విక్రయిస్తున్నారన్నారు. 80సంచుల్లో దాదాపు 40 క్వింటాళ్ల నూకను బొలెరో వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారంతో దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

మంత్రాలయం డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఈ గోవిందు తెలిపారు. సోమవారం సబ్ స్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఈ మాట్లాడుతూ మంత్రాలయంలోని విద్యుత్ డీఈ కార్యాలయం ఆవరణంలోట్రాన్స్‌కో ఏడీఈ విశ్వశాంతి స్వరూప్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామన్నారు. ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలోని వినియోగదారులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కేసీ నరసప్ప, రంగస్వామి, జూనియర్ ఇంజనీర్ వేణుగోపాల్, ప్రదీప్ కుమార్, భీమన్న పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


సోమప్ప సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. యూనియన్ పిలుపు మేరకు సోమవారం ఐదో రోజు సమ్మె చేపట్టారు. ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయం ఎదుట సమ్మెకు కూర్చున్నారు. ఈ సందర్భంగా నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం తమ ప్రధాన డిమాండ్లు అంగీకరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కార్యదర్శి తిమ్మగురుడు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ప్రతి కార్మికునికి కనీస వేతనం రూ 26వేలు, సరెండర్ లీవ్‌లు ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్స్‌ను విధుల్లోకి తీసుకోవాలని, మరణించిన కార్మికునికి రూ. 10లక్షలు ఎక్స్‌గ్రేషియా, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ వరప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కాగా, కార్మికులు సమ్మెలో ఉండటంతో రాత్రి పట్టణంలో విద్యుత్ దీపాలు వెలగలేదు. పట్టణమంతా అంధకారంగా మారింది. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు యల్లప్ప, కార్యదర్శి శివకృష్ణ, నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, బాలాజి, పంపాపతి, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై

ప్రత్యేక నిఘా

డీఎస్పీ ఉపేంద్రబాబు

మంత్రాలయం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలో రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని, గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఉపేంద్రబాబు హెచ్చరించారు. సోమవారం మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేశారు. మౌలికవసతులు, పోలీసు సిబ్బంది, కేసుల నమోదు, రౌడీషీటర్ల వివరాలు, కర్ణాటక మద్యం, బెల్టు షాపులు, పేకాట, ట్రాఫిక్ సమస్య, చోరీలు, మహిళా చట్టాల కేసులు వంటి అంశాలను పరిశీలించారు. ఏడాదిలో 243 కేసులతో పాటు 350 పెట్టీ కేసులు నమోదు చేశామన్నారు. మంత్రాలయం పోలీస్‌స్టేషన్ పరిధిలో 22 మంది రౌడీషీటర్లు ఉన్నారని, వారిపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. మంత్రాలయంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పల్లెనిద్రలో బాగంగా పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మంత్రాలయం సీఐ రామాంజులు, మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు పరమేష్ నాయక్, విజయకుమార్, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, రమణ, పరమేష్, జమీర్ రామకృష్ణ సురేంద్రబాబు, గోపి, రంగస్వామి, నిర్మలమ్మ పాల్గొన్నారు.


మంత్రాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

పెళ్లి వేడుకల్లో డీజేలకు అనుమతి లేదు

గోనెగండ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పెళ్లి వేడుకల్లో డీజేల ఏర్పాటుకు అనుమతి లేదని, నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని గోనెగండ్ల సీఐ గంగాధర్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తక్కువ శబ్దం వచ్చే మైకులకు కూడా అనుమతి లేదని, అలాంటి వాటి కోసం డీఎస్పీ అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఈ శబ్దం కూడా 70 డెసిబుల్స్ వరకు మాత్రమే అనుమతి ఉంటుందని, రాత్రి 10 గంటల తరువాత కూడా కొనసాగిస్తే చర్యలు తప్పవన్నారు. డీజే చప్పుడు వల్ల ఎక్కువ అనార్థలు చోటు చేసుకుంటున్నాయన్నారు.

నేడు రెవెన్యూ గ్రామ సభ

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని కుర్నీ కల్యాణ మండపంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శేషఫణి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన రైతులు ఏవైనా సమస్యలు ఉంటే రెవెన్యూ గ్రామ సభలో వినతి పత్రం ఇచ్చి పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో ఆర్ఎస్‌డీటీ జ్యోతీర్మయి, డీటీ వీరేంద్రగౌడు, ఆర్ఐ లక్ష్మన్న, వీఆర్వో మోహన్‌బాబు పాల్గొన్నారు.

ప్రజా పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి 11 వినతులను స్వీకరించారు. ఇందులో సర్వే కొలతలు, ఇంటి పట్టాలు, మ్యుటేషన్‌కు సంబంధించిన అర్జీలు వచ్చాయన్నారు. అర్జీదారుల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

సోలార్ టాప్‌ను ఏర్పాటు చేసుకోవాలి

ఎమ్మిగనూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ విద్యుత్ టాప్‌లను ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఎమ్మిగనూరు డీఈ విజయ్ కుమార్ సూచించారు. సోమవారం పట్టణంలోని ఎస్‌బీఐ సర్కిల్‌లో సోలార్ విద్యుత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ టాప్‌ను ఏర్పాటు చేసుకునే వారికి కేంద్రప్రభుత్వం ఒక కిలో వాట్‌కు రూ. 30లు సబ్సిడీ ఇస్తుందన్నారు. అలాగే బ్యాంకుల ద్వారా రుణాలు కూడా ఇస్తారన్నారు. ముఖ్యంగా 200 యూనిట్లు పైబడి విద్యుత్ వాడకం చేసేవారికి సోలార్ టాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఒక కిలో వాట్‌కు 120యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తద్వారా రూ. 1000 వచ్చే బిల్లు రూ. 338 మాత్రమే వస్తుందని దీంతో కిలో వాట్‌కు ఏడాదికి రూ. 8వేలు ఆదా అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మిగనూరు ఏడీఈ నాగేంద్ర, ఏఈ ప్రసన్న కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


సౌర విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

లక్ష్యానికి మించి ఆదాయం

- ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్

లక్ష్యం రూ. 6.10 కోట్లు, వసూలు 6.14 కోట్లు

ఎమ్మిగనూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెస్సు వసూళ్లలో ఈ ఏడాది లక్ష్యాన్ని దాటి వసూలు చేసింది. వాస్తవంగా మార్కెట్ కమిటీ 2023-24 సెస్సు వసూలు లక్ష్యం రూ. 6.10 కోట్లు, ఈ మొత్తాన్ని 2024 మార్చి లోపు పూర్తి చేయాలి. అయితే మార్కెట్ కమిటీ మాత్రం నాలుగు నెలల ముందే లక్ష్యాన్ని పూర్తి చేసి రికార్డు సృష్టించింది. ఈనెల 5 నాటికి మార్కెట్ రూ. 6.14కోట్లు వసూలు చేసింది. గత ఏడాది ఇదే సమయానికి మార్కెట్ సెస్సు రూ. 3.47కోట్లు వసూలు అయ్యింది. ఈ ఏడాది మాత్రం నాలుగు నెలల ముందే లక్ష్యాన్ని పూర్తి చేయటం పట్ల మార్కెట్ కమిటీ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చిలోపు మరో రెండు కోట్లు వసూలు అయ్యే అవకాశం ఉందని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి పద్మావతి తెలిపారు.

● సీసీఐ ద్వారా 1533 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

ఎమ్మిగనూరులోని నాలుగు సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1533 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశామని మార్కెట్ కమిటీ కార్యదర్శి పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ సీసీఐ కేంద్రాలకు రైతులు తెచ్చిన పత్తిని వెనక్కి పంపకుండా తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. ఇప్పటి నుంచి రైతులు పండించిన పత్తిని సీసీఐకి అమ్ముకునే అవకాశం ఉందని, రైతులు పండించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు. బహిరంగ మార్కెట్‌లో విక్రయించి నష్టపోవద్దన్నారు. మార్కెట్ చెక్‌పోస్టులను జిన్నింగ్ పరిశ్రమలను, వ్యాపార దుకాణాలను నిత్యం మార్కెట్ సిబ్బంది తనిఖీలు చేస్తున్నారన్నారు. వ్యాపారులు ప్రభుత్వ అనుమతులు తీసుకొని పత్తి వ్యాపారం చేసుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.




మాట్లాడుతున్న ప్రత్యేక శ్రేణి కార్యదర్శి పద్మావతి